

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
గుంటూరు పల్నాడు
బుధవారం 18 మార్చి 2026 - పేజీలు 10



## అక్షయపాత్ర ప్రస్థానం 25 ఏళ్లు

మిగతా 3




### రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే

## మన ఏకైక లక్ష్యం కావాలి

- ఒప్పందాలు కాకుండా పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి చేయాలి
- ఏపీఈడీబీ అధికారులకు మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం
- మంగళగిరిలో ఏపీ ఎకనామిక్ డెవలప్ మెంట్‌బోర్డు నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి


మిగతా 3

మంగళగిరి, మేజర్ న్యూస్: రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పమే మన ఏకైక లక్ష్యం కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు.

### నిషేధం ఉన్నా యథేచ్ఛగా..

## లాటరీ టికెట్ల విక్రయం

- పట్టించుకోని అధికారులు
- అమాయకులు ఆశలను సొమ్ము చేసుకుంటున్న నిర్వాహకులు
- పిడుగురాళ్లలో మాత్రం జోరుగా, యథేచ్ఛగా నడుస్తోన్న వ్యవహారం
- వైసిపి పాలనలో విస్తరించి కూటమి పాలనలోనూ కొనసాగుతున్న వైనం




పిడుగురాళ్ల, దాచేపల్లి మేజర్ న్యూస్: రాత్రికి రాత్రే కోటీశ్వరుడని ఆటోడ్రైవర్‌ను ఉరిస్తారు.. అదృష్టమంటే నీదేనంటూ హమాలీకి ఆశ చూపిస్తారు.. ఖచ్చితంగా నీకే తగులుతుందని ఆశ చూపిస్తారు. ఈ విధంగా రోజు వారీ కూలీలు,మధ్య తరగతి ప్రజలను లాటరీ పేరు తో మభ్య పెట్టి కోట్లు దండుకుంటున్న లాటరీ నిర్వహకుల వ్యవహారం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో యధేచ్ఛగా కొనసాగుతోంది.

మిగతా 03

## సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి



- భావోద్వేగాల మధ్య ముగిసిన మున్సిపల్ కౌన్సిల్

తెనాలి, మేజర్ న్యూస్ : తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఆప్యాయత, అనురాగం, భావోద్వేగంతో ముగిసింది. కౌన్సిల్ ఐదేళ్ల కాల పరిమితి మంగళవారంతో ముగియడంతో మధురస్మృతులను

మిగతా 8లో

### అవయవదానంతో

## పలువురికి పునర్జన్మ

చివరి శ్వాసలోనూ జీవం పంచిన మధుశ్రీ



గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ : జంగారెడ్డి గూడెంకు చెందిన నాయుడు మధుశ్రీ, 25సం॥లు, వివాహిత, ఈమెకు ఇద్దరు పిల్లలు. క్షణికావేశంలో ఆత్మహత్యా ప్రయత్నం చేసుకోవటం జరిగింది. కుటుంబసభ్యులు గమనించి సమీపంలోని హాస్పిట లు తీసుకువెళ్ళటం, డాక్టర్లు పరీక్షించి అత్యవసర చికిత్సకొరకు విజయవాడలోని ప్రవేట్ హాస్పిటలుకు చికిత్సకొరకు తీసుకురావటం జరిగింది. చికిత్సకు సహకరించక

మిగతా 3లో



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

### పరిశ్రమలు ప్రజల అభివృద్ధికి

## తోడ్పాటునందించాలి

- సభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యల్ని పరిష్కరించాలి
- సాగర్ సిమెంట్స్ ప్రజాభిప్రాయ సేకరణలో ఎమ్మెల్యే యరపతినేని
- ప్రజలు, సామాజిక,స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు సూచనలన్నింటిని రికార్డు చేశాం
- పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా - ప్రశాంతంగా ముగిసిన సాగర్ సిమెంట్స్ ప్రజాభిప్రాయ సేకరణ

03

దాచేపల్లి, మేజర్ న్యూస్: ఏదైనా ప్రాంతం లో ఒక పరిశ్రమ ఉంది అంటే ఖచ్చితంగా ఆ ప్రాంత ప్రజల అభివృద్ధి కి తోడ్పాటునందించాలని పల్నాడు జిల్లా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పరిశ్రమ యాజమాన్యాలకు సూచించారు.మంగళవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం గ్రామం సాగర్ సిమెంట్స్ కు సున్నపు రాయి లీజు కేటాయింపునకు సంబంధించి జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన కేంద్ర పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సాగర్ సిమెంట్స్ యాజమాన్యం, అధికారులకు పలు సూచనలు

# జిల్లా కలెక్టరేట్‌లో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

- వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి
- జాయింట్ కలెక్టర్ సంజనా సింహా



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** వినియోగదారులు తమ హక్కులను కాపాడుకోవడంతో పాటు, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజనా సింహ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని పి.జి.ఆర్.ఎస్ హాలులో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ విద్యార్థులు, వినియోగదారుల హక్కుల సంఘం ప్రతినిధులు మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తే, వారు తమ తల్లిదండ్రులకు మరియు సమాజానికి మెరుగ్గా వివరించగలరని ఆమె ఆకాంక్షించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ కొనుగోళ్లు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, సైబర్ మోసాల బారిన పడకుండా వినియోగదారులకు మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కన్స్యూమర్ నాయకులు కె కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మనం కల్తీ ప్రపంచంలో ఉన్నాము కల్తీ సామ్రాజ్యం రాజ్యమేలుతుంది కల్తీల నివారణ కొరకు ప్రతి ఒక్కరూ ఉక్కు పాదం మోపాలి పోరాటం చేయాలి అలాగే నాణ్యత గల వస్తువుల్ని అడిగి తీసుకోవాలి నాణ్యత లోపించినప్పుడు లేదా అన్యాయం జరిగినప్పుడు సమాచారాన్ని అడిగి తెలుసుకోవడం, ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా సరఫరా అధికారి ఎం.వి. ప్రసాద్ మాట్లాడుతూ.. గ్యాస్ వినియోగదారులు సిలిండర్ బుక్ చేసుకున్నప్పుడు అది సకాలంలో అందుతోందా, సరైన తూకంతో వస్తోందా, లేదా అన్నది గమనించాలని కోరారు. సమావేశంలో భాగంగా ఆహార భద్రత, తూనికలు-కొలతల శాఖ అధికారులు విద్యార్థులకు నాణ్యత ప్రమాణాల యంత్రాలను ప్రదర్శించారు. ఆహార పదార్థాల్లో నాణ్యతను ఎలా గుర్తించాలో విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించారు. అనంతరం వినియోగదారుల హక్కులపై రూపొందించిన గోడ పత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు.



## రైతుల మేలుకోరే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** రైతుల మేలు కోరే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమే అని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు అన్నారు.ఈ రోజు రైతన్న మీకోసం,అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ లబ్ధిదారులను కలిసి కూటమి ప్రభుత్వం చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను వివరించి కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమం లో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు,జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు షేక్ ముంతాజ్, పెదకూరపాడు గ్రామ రైతు భరోసా కేంద్ర ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు గ్రామాలలో రైతన్న మీ కోసం కార్యక్రమం




**పొన్నూరు, మేజర్ న్యూస్:** పొన్నూరు మండలము పచ్చలతాడిపర్రు, దండమూడి గ్రామముల నందు రైతన్న మీకోసం కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమ నికి ముఖ్య అతిథిగా పొన్నూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి, మండల వ్యవసాయ అధికారి రాజవరపు.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వము అమలు చేయుచున్న ఐదు ప్రధాన వ్యవసాయ కార్యాచరణాలపై రైతులకు వివరిస్తూ 1. నీటి భద్రత : ప్రతి ఎకరాకు సాగు నీరందించే దిశగా అసంపూర్తిగా వున్న ప్రాజెక్టులను పూర్తి చేసి సమర్థ నీటి నిర్వహణలో అన్ని ప్రాజెక్టులు నింపుతాము అన్నారు. 2. డిమాండ్ ఆధారిత పంటలు : నేడు మారుతున్న జీవనశైలి ఆహార అలవాట్లకు అనుగుణముగా అన్నదాతలు పంట మార్పిడి పాటించవలెను. చిరుధాన్యాల సాగు పెంచవలెను. ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున చేపట్టవలెను. 3. అగ్రిటెక్ : రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ పథకములో యూనిక్ ఐడి నమోదు చేస్తున్నాము. APAIMS పోర్టల్ నందు నమోదు అయ్యి ప్రభుత్వం ద్వారా అమలవుచున్న పథకములు చీడపీడలో సమస్యలు పరిష్కారం, ఈ పంట నమోదు చేయించుట గురించి రైతులు సాంకేతికతను పొందవచ్చును, డ్రోన్ సాంకేతికతను వివరించినారు. 4. ఫుడ్ ప్రాసెసింగ్ 5. రైతులకు మద్దతు ధర కల్పించి సమయానుకూలముగా రైతుల నుండి పంట కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించుట, ప్రకృతి వైపరీత్యములు వచ్చినప్పుడు వంట నష్టం ( ఇన్పుట్ సబ్సిడీ ) వెంటనే రైతులకు చెల్లించుట భూసార పరిరక్షణ కొరకు పచ్చిరొట్ట పైర్లు వినియోగం మరియు వాతావరణ మార్పుల వలన కలుగుతున్న దుష్ప్ర పరిమాణములు(ఎల్ నినో వలన వర్షాభావం గురించి ) రైతులకు అవగాహన కల్పించినారు. ఈ కార్యక్రమము నందు వ్యవసాయ విస్తరణ అధికారి గ్రేడ్ 1 ఐ శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు వి వాసవి శ్రీ, సిహెచ్ రూప, పొన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్ వైజర్ అవినాష్, అమరేంద్ర, రైతులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**మంగళగిరి, మేజర్ న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు మార్చి 18వ తేదిన మంగళగిరిలో పర్యటించనున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా , పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మంగళవారం మంగళగిరిలో ఏర్పాట్లు పరిశీలించారు. “దివ్యాంగ శక్తి“ దివ్యాంగులకు ఉచిత బస్ సౌకర్యం ప్రారంభించి, వారితో కలసి మంగళగిరి నుండి ఉండవల్లి వరకు ప్రయాణించే అవకాశాలు, అందుకు తగిన ఏర్పాట్లు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆర్ ఎం సామ్రాజ్యం, అదనపు ఎస్పీ జి.వి. రమణ మూర్తి, ఎం.టి.ఎం.సి మున్సిపల్ కమిషనర్ అలీం భాషా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## గ్యాస్ ఏజెన్సీల్లో తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ

**తెనాలి, మేజర్ న్యూస్ :** ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా గ్యాస్ గురించి ప్రజలు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ కె వి గోపాలకృష్ణ సూచించారు. తెనాలిలోని పలు గ్యాస్ ఏజెన్సీలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యాస్ గోడౌన్లలో రికార్డులను పరిశీలించారు. గ్యాస్ ఏజెన్సీలలో బుకింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిలిండర్లు ఎన్ని అందుబాటులో ఉన్నాయన్నది ఆరా తీశారు. రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఏజెన్సీలు ఆయనకు మంచి పేరు తీసుకువచ్చేలా పనిచేయాలని కోరారు. ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ అందుతుందని తెలిపారు. స్టాక్ ఇండెంట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే మంత్రి మనోహర్ దృష్టికి తీసుకువెళ్లి స్టాక్ కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తన కార్యాలయంలో ఆయన గ్యాస్ ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. పలు సూచనలు, సలహాలు అందించి గ్యాస్ గురించి ఆందోళన చెందవద్దని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సివిల్ సప్లయ్ ఆర్ఐ జాన్, వీఆర్వో మహేష్, పలువురు అధికారులు ఉన్నారు.

## జడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన ఎమ్మెల్యే చదలవాడ

- జిల్లా అభివృద్ధి, గ్రామీణ సమస్యల పరిష్కారం పై చర్చలు

**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట ఎమ్మెల్యే డాఎచదలవాడ అరవింద బాబు గుంటూరు జిల్లా పరిషత్ (జడ్పీ ) చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టియానను మర్యాదపూర్వ కంగా కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు,తాగునీటి సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల పై ప్రత్యేకంగా దృష్టి సారించారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యల పై ఇద్దరూ సమగ్రంగా చర్చించారు. అలాగే పాఠశాలలు,ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి,ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాఎచదలవాడ సూచించారు. గ్రామ స్థాయిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. జిల్లా అభివృద్ధి కోసం పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నరసరావుపేట మండల పార్టీ అధ్యక్షులు బందారుపల్లి విశేశ్వర్ రావు పాల్గొన్నారు.





## నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలి

**తాడికొండ మేజర్ న్యూస్:** ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం నాడు కంతేరు గ్రామంలో పార్టీ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు అధ్యాపకులకు పలు సూచనలు చేశారు ముఖ్యంగా బాలికలకు అవసరమైన మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని అదేవిధంగా పాఠశాల ఆవరణ కూడా పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంచాలని అధ్యాపకులకు ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న వంటశాలను సందర్శించి పరిశు భ్రంగా ఉండాలని ఆదేశించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ ప్రభుత్వ అందజేసే యూనిఫామ్ స్కూల్ బ్యాక్ షూస్ మరియు పాఠ్యపుస్తకాలను సక్రమంగా వినియోగించుకొని దేశానికి రాష్ట్రానికి సేవ చేసే విధంగా తయారవ్వాలని ఆయన కోరారు. అనంతరం రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం రైతులు కోసం అందజేస్తున్న సౌలభ్యాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నీటి భద్రత వ్యవసాయ రంగంలో సాంకేతిక వ్యవసాయ వినియోగం ఆహార శుద్ధి పరిశ్రమలు వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో తాడికొండ మండల కూటమి నాయకులు, కంతేరు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# అక్షయపాత్ర ప్రస్థానం 25 ఏళ్లు





మొదటి పేజీ తరువాయి

**మంగళగిరి, మేజర్ న్యూస్:** అక్షయపాత్ర ఫౌండేషన్ 25 ఏళ్లలో దేశవ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు 500 కోట్ల (5 బిలియన్) భోజనాలు అందించే అరుదైన మైలురాయికి చేరింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పీఎం పోషణ్ పథకంలో భాగంగా ఈ నెల 17న ఢిల్లీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రం(ఆర్బీసీసీ) లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, గౌరవ అతిథిగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, అక్షయ పాత్ర ఛైర్మన్ మధు పండిత్ దాస, వైస్ ఛైర్మన్ చంచల పతి దాస, ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ రీజినల్ ప్రెసిడెంట్ శ్రీ వంశధార దాస ఇతర ఉన్నతాధికారులు హాజరు అయ్యారు.

**అక్షయ పాత్ర ప్రస్థానం ఇలా....**

పిల్లల ఆకలి తీర్చి పాఠశాలలకు హాజరు పెంచడం లక్ష్యంగా బెంగళూరులో 2000 సంవత్సరంలో 1,500 మంది పిల్లలతో అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రస్థానం ప్రారంభం అయ్యింది. స్వచ్ఛంద పాఠశాల భోజన కార్యక్రమంతో 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 23.50 లక్షల మంది పిల్లలకు నిత్యం పోషకాహారం అందిస్తోంది. 2024 ఏప్రిల్ 2న న్యూయార్క్ లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో 400 కోట్ల భోజనాలు మైలురాయి వేడుక జరగగా.. ఈ నెల 17న 500 కోట్ల భోజనాల వేడుక ఢిల్లీలో రాష్ట్రపతి సమక్షంలో జరిగాయి.

# రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం కావాలి



మొదటి పేజీ తరువాయి

మంగళగిరి సమీపం చినకాకానిలోని మయూరి టెక్ పార్క్ భవనం ఐదో అంతస్తులో ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు(ఏపీఈడీబీ) నూతన కార్యాలయాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందుగా టెక్ పార్క్ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యాలయం మొత్తం కలియతిరిగారు. ఈ సందర్భంగా ఏపీఈడీబీ ఉద్యోగులకు దిశానిర్దేశం చేస్తూ.. గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసింది. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం కావాలి. ఒప్పందాలు కాకుండా పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా కృషి చేయాలి. యువగళం పాదయాత్ర సమయంలో యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాను. జీడీ నెల్లూరులో పాదయాత్ర చేస్తున్న సమయంలో రోడ్డు పక్కన బజ్జీలు విక్రయించే మోహన అనే మహిళను కలిశాను. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం వద్దని, తమ పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తే చాలని ఆమె చెప్పారు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే పెద్దఎత్తున పెట్టుబడులు సాధించాం. దేశానికి వచ్చిన వంద రూపాయల పెట్టుబడుల్లో 25 రూపాయాలు ఏపీకి వచ్చాయి. ఇందుకు ఏపీ ఈడీబీ బృందానికి అభినందనలు. సీఈవో సాయికాంత్ వర్మకు నా హృదయపూర్వక అభినందనలు.

**ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయి**

గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయి. ఇప్పుడు మనం మరింత స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉంది. ఎన్ని ఉద్యోగాలు కల్పించామన్నదే ముఖ్యం. రిలయన్స్ సీబీజీ ప్రాజెక్ట్ వల్ల పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తున్నాయి. ఇది ప్రారంభం మాత్రమే. ఉద్యోగాల కల్పనే మన సింగిల్ ఎజెండాగా ఉండాలి. నూతన పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్ మన ప్రధాన లక్ష్యం కావాలి. ఈ నెల 23 రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తున్నాం. ఇంతటితో తృప్తిపడకూడదు. ఎందుకు ఐదు స్టీల్ సిటీలు నిర్మించకూడదు? అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ చివరినాటికి ఉండవల్లి నుంచి సీడ్ యాక్సిస్ రోడ్ అందుబాటులోకి వస్తుంది. ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ ఎమ్. అభిషిక్త్ కిషోర్ ఇతర ఉన్నతాధికారులు ఎంటీ కృష్ణబాబు, సౌరభ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమలు ప్రజల అభివృద్ధికి తోడ్పాటునందించాలి



మొదటి పేజీ తరువాయి

చేశారు. పల్నాడు ప్రాంతంలో అనేక పరిశ్రమల ప్రజాభిప్రాయ సేకరణ సభల్లో పాల్గోనటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రతి పరిశ్రమ యాజమాన్యానికి సూచనలు చేయటం జరిగిందన్నారు. ప్రధానంగా పరిశ్రమ స్థాపనకు భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని, స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, కార్పోరేట్ సామాజిక బాధ్యత గా అయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచనలు చేయటం జరిగిందని యరపతినేని తెలిపారు. పరిశ్రమ పరిధిలోని గ్రామాల ప్రజలకు సంబంధించి ఏవైనా సమస్యలు ప్రభుత్వం ద్వారా పరిష్కారం కాకపోతే సి ఎస్ ఆర్ యాక్టివిటీస్ క్రింద పరిశ్రమ యాజమాన్యం వారిని ఆదుకోవాలని సూచించారు. సభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలన్నింటిని పరిష్కరించే విధంగా యాజమాన్యంతో చర్చిస్తానన్నారు. ఏది ఏమైనా పరిశ్రమలు ప్రజలను అభివృద్ధి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఏదైతే ఆంధ్రా (సాగర్) సిమెంట్స్ కు సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో సున్నపురాయి గనులు లీజు కోసం నిర్వహించిన ఈ ప్రజాభిప్రాయ సేకరణ సభ లో ప్రజలు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అన్ని అంశాలను రికార్డు చేయటం జరిగిందని, ప్రతి అంశానికి సంబంధించి సాగర్ సిమెంట్స్ యాజమాన్యం పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని, ప్రజాభిప్రాయ సేకరణ సభ విజయవంతంగా జరగటానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

**మా గ్రామ పరిధిలో ఫ్యాక్టరీ ఉన్న గ్రామాభివృద్ధికి తోడ్పాటు లేదు**




మా గ్రామ పరిధిలో ఫ్యాక్టరీ ఉన్న గ్రామాభివృద్ధికి ఫ్యాక్టరీ యాజమాన్యం సహకారం అందించలేదన్నారు. ఇంకా గ్రామంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. ప్రజాభిప్రాయ సేకరణ సభలో పల్నాడు జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇఇ షమీమా బేగం, గురజాల ఆర్డీవో మురళి కృష్ణ, దాచేపల్లి తహశీల్దార్ శ్రీనివాసులు, పలువురు మండల స్థాయి అధికారులు, విఆర్ఓ లు పాల్గొన్నారు. దాచేపల్లి సిఐ భాస్కర్ తో పాటు పలువురు సిఐలు, ఎస్ ఐ లు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

– శ్రీనగర్ మాజీ సర్పంచ్ మాశెట్టి పుల్లారావు

## నిషేధం ఉన్నా యథేచ్ఛగా

# లాటరీ టికెట్ల విక్రయం



మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర వ్యాప్తంగా నిషేధం ఉన్న పిడుగురాళ్ల లో మాత్రం లాటరీ టిక్కెట్ల వ్యాపారం నిరాటంకంగా సాగుతుందని పలువురు పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం లో మొదలై కూటమి ప్రభుత్వం లో కూడా కొనసాగుతున్న ఈ లాటరీ వ్యాపారం వలన అమాయక ప్రజలు బలైవుతున్నారు. పట్టణం లో చిన్న చిన్న కిల్లీ, బడ్డీ, కొట్టు లో కూడా లాటరీ టిక్కెట్లు అమ్మకాలు జరుగుతున్నాయంటే వ్యాపారం ఏ విధంగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇంతా జరుగుతున్న ఇక్కడి అధికారులు మాత్రం ఏమి పట్టనట్టు వ్యవహరించడం పట్టణ ప్రజల్లో చర్చ జరుగుతోంది. రండీ మీఅదృష్టాన్ని పరీక్షించుకోండిఅనీ ఇది లాటరీ నిర్వాహకుల ప్రచారం. ఇలా అక్రమంగా డబ్బు ఎలా సంపాదించొచ్చో, అమాయకులను ఎలా దోచుకోవచ్చో, పేదల కష్టాన్ని ఎలా జుర్రుకోవచ్చో, వారికి డబ్బు ఆశ చూపి రూ. లక్షలు సంపాదించవచ్చని నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు ఆశ చూపి లాటరీ టికెట్లు పేరుతో వేలకు వేలు దోచుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా లాటరీలపై నిషేధం ఉన్నా. వీరి మాటలు నమ్మి మోసపోయే మధ్య తరగతి కుటుంబాలు తాము కోటీశ్వరులు కావాలని అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి తాముసంపాదించిందంతా లాటరీలో పెట్టు బడులు పెడుతున్నారు. ఏళ్లతరబడి ఇలా కొనుగోలు చేసి లక్షలాది రూపాయలుపోగొట్టుకున్నవారు ఎందరో, అలా రోజువారీ కూలీలు, కార్మికులు లాటరీ టికెట్ల కొనుగోలుకు అలవాటుపడి కష్టార్జితాన్ని అక్రమార్కుల పాలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీరి ఆగడాలను అరికట్టి పేద ప్రజల జీవితాలను కాపాడాలనిపట్టణ ప్రజలు కోరుతున్నారు.

# అవయవదానంతో పలువురికి పునర్జన్మ

మొదటి పేజీ తరువాయి

పోవటం వలన మెరుగైన వైద్య చికిత్స కోసం కిమ్స్ శిఖర హాస్పిటల్స్, గుంటూరు కి ఈ నెల 13వ తేదిన తీసుకురావటం జరిగింది. ఆత్మహత్యా ప్రయత్నం (ఉరి వేసుకోవడం) వలన బ్రెయిన్ ఫంక్షన్ దెబ్బతినడంతో డా. ప్రదీప్ కుమార్ రెడ్డి, న్యూరాలజిస్ట్, డా. చిట్టెం లక్షణ్ గారు, న్యూరోసర్జన్ పర్యవేక్షణలో చికిత్సను కొనసాగించడం జరిగింది. కిమ్స్ శిఖర హాస్పిటల్ వైద్య బృందం చికిత్స అందించినా ఫలితం లేకపోయేసరికి, డాక్టర్ గారు ఈ నెల 15వ తేదిన మార్చి 2026న ఆప్నియా టెస్ట్ చేయటంతో రిపోర్ట్ పాజిటివ్గా రానటం, చికిత్సకు సహకరించటం లేదని వారి కుటంబ సభ్యులకు వివరించి, బ్రెయిన్ డెడ్గా డిక్లేర్ చేయటం జరిగింది. వారికి అవయవదానం యొక్క విశిష్ఠతను వివరించడంతో బాధలోకూడా తల్లిదండ్రులు తమ బాధను దిగమింగుకుంటూ ఆపదలో ఉన్న వారికి ఈ అవయవ దానంతో ప్రాణా పాయంలో ఉన్న కొంతమందికి పునర్జన్మ కల్పించ వచ్చు అని, భర్త గారైన నాయుడు దుర్గారావు గారు, ఆమె తండ్రి గారైన దొంకిన సత్యన్నారాయణ గారికి, తల్లి గారైన రాధ గారికి, కుటుంభసభ్యులకు జీవన్ థాన్ సభ్యులు కౌన్సిలింగ్ ఇవ్వటం తో వారు అవయవదానానికి ఒప్పుకోవటం తమ బిడ్డ అవయువాలు వేరొకరికి నూతన జీవితాన్ని ఇస్తాయని తెలుసుకొని ముందుకొచ్చి అవయవదానం చేయటం ఎంతో మంచి విషయం అని, అవయవదానం చేయటం వలన కొంత మందికి జీవించే అవకాశం కలుగుతుందని హాస్పటల్ మేనేజ్ మెంట్ వారు తెలిపారు. ఈ నెల 16వ తేదీన బ్రెయిన్ డెడ్గా నిర్ధారించి ఆమె నుండి లివర్, కిడ్నీ లంగ్ మరియు కళ్ళను సేకరించి ప్రాణా పాయంలో ఉన్న వారికి అమర్చుటకు తరలించడం జరిగింది.

# పన్నులపై 50% వడ్డీ రాయితీ

**– మార్చి 31 వరకు ప్రత్యేక అవకాశం**

**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలోని విద్యాసంస్థలు, కమర్షియల్, రెసిడెన్షియల్ భవనాలు మరియు ఖాళీ స్థలాల యజమాను లకు ముఖ్య ప్రకటన విడుదలైంది. పన్ను చెల్లింపుదారులు తమ పాత మరియు ప్రస్తుత బకాయిలను ఈ నెల 31 లోపు ఒకేసారి చెల్లిస్తే, ప్రభుత్వం ప్రకటించిన 50 శాతం వడ్డీ రాయితీ పొందవచ్చని మునిసిపల్ అధికారులు తెలిపారు. ఈ సదుపాయాన్ని సులభతరం చేసేందుకు పురపాలక కార్యాలయంలో ప్రత్యేక కలెక్షన్ కౌంటర్లు ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు, సెలవు దినాల్లో కూడా పనిచేయనున్నాయి. అదనంగా వార్డులలో మొబైల్ వాహనాల ద్వారా పన్నులు చెల్లించే సౌకర్యం కల్పించారు. చెల్లింపులు చేసిన వెంటనే ఆన్లైన్ రశీదు పొందే విధంగా సదుపాయం కలదు. సిడిఎంఏ వెబ్‌సైట్ ద్వారా కూడా పన్నులు చెల్లించవచ్చు. ఇప్పటికే వడ్డీ చెల్లించిన వారికి కూడా ఈ రాయితీ వర్తించనుండగా, అందులోని 50 శాతం వడ్డీని రాబోయే ఆర్థిక సంవత్సర పన్నులకు జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కుని గడువు లోపు పన్నులు చెల్లించాలని పురపాలక కమిషనర్ తెలిపారు.

# ఫార్మాసూటికల్స్ సైన్స్ లో విద్యార్థుల భవిష్యత్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం




**పెదకాకాని మేజర్ న్యూస్:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో మంగళవారం విద్యార్థుల భవిష్యత్తు అవకాశాలపై అవగాహన కల్పించే విధంగా బ్యాంక్ ఆఫ్ బరోడా అచీవర్స్ అవార్డు ప్రెజెంటేషన్ -- 2025--2026 (గుంటూరు రీజియన్) కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి బ్యాంక్ ఆఫ్ బరోడా గుంటూరు ప్రాంతానికి చెందిన చీఫ్ మేనేజర్ వుండి శ్రీనివాసరావు క్రెడిట్ హెడ్ సాహూ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు బ్యాంక్ అందిస్తున్న వివిధ ఆర్థిక సహాయ పథకాల గురించి విస్తృతంగా వివరించారు. ప్రత్యేకంగా, ఉన్నత విద్య కోసం విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఎడ్యుకేషన్ లోన్స్ వాటి ప్రయోజనాలు, విదేశీ విద్య సహా ఉన్నత చదువులకు అవసరమైన ఆర్థిక సహాయం గురించి వివరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్యను కొనసాగించడానికి అవసరమైనంత వరకు బ్యాంక్ ద్వారా విద్యా రుణాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో బ్యాంక్ ఆఫ్ బరోడా తరఫున ముగ్గురు ప్రతిభావంతులైన బి.ఫార్మసీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ప్రతిఒక్కరికీ రూ.31,000 చొప్పున నగదు బహుమతిని చెక్కుల రూపంలో అందజేసి వారి ప్రతిభను సత్కరించారు. పురస్కారాలు అందుకున్న వారిలో మొహమ్మద్ అజామ్ -- విద్యా ప్రతిభ పార్వతి-- క్రీడా ప్రతిభ అమృత వర్షిణి-- ఆల్ రౌండర్ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. తేజోమూర్తి మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. ఈ. ప్రవల్లిక పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి బ్యాంక్ ఆఫ్ బరోడా తీసుకున్న ఈ చర్య ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు, ఆర్థిక సహాయం గురించి అవగాహన పెంపొందించడమే కాకుండా, వారి ప్రతిభను ప్రోత్సహించే ఒక ఉత్తేజభరిత వేదికగా నిలిచింది.

## మానవ విలువలు పెంపొందించాలంటే ప్రతి ఒక్కరూ సామాజిక సేవకులు కావాలి




**పెదకాకాని మేజర్ న్యూస్:** ప్రపంచంలో కనుమరుగవుతున్న మానవ విలువలను పెంపొందించాలంటే ప్రతి ఒక్కరు సామాజిక సేవలుగా సేవకులుగా మారాల్సిన అవసరం ఉందని డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్, డైరెక్టర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ వి. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ సోషియాలజీ సోషల్ వర్క్ విభాగం నందు వరల్డ్ సోషల్ వర్క్ డేను విభాగాధిపతి ప్రొఫెసర్ యం. త్రిమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రతి సంవత్సరం ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ సోషల్ వర్క్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా సామాజిక సేవ యొక్క ప్రాముఖ్యతని తెలియజేయుట కొరకు మార్చి నెల మూడవ మంగళవారాన్ని వరల్డ్ సోషల్ వర్క్ డే గా నిర్వహిస్తారు దీనిలో భాగంగా ఈ సంవత్సరం కో బిల్డింగ్ హోప్ అండ్ హార్మోని - ఏ హరాంబి కాల్ టు యునైట్ ఎ డివైడెడ్ సొసైటీ అనే ఇతివృత్తంతో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విభాగాధిపతి ప్రొఫెసర్ వీ. త్రిమూర్తిరావు మాట్లాడుతూ వరల్డ్ సోషల్ వర్క్ డే ప్రాధాన్యత గురించి ఈ సంవత్సరపు ఇతివృత్తం గురించి సవివరంగా చెప్పడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్, డైరెక్టర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సామాజిక సేవ యొక్క తాత్విక దృక్పథాన్ని ప్రస్తుత ప్రపంచంలో సోషల్ వర్కర్స్ యొక్క ఆవశ్యకతను గురించి తెలియచేస్తూ కనుమరుగవుతున్న మానవ విలువలను కాపాడుకోవాలంటే ప్రతీ ఒక్కరు సామాజిక సేవా కార్యకర్తలుగా మారాలని పిలుపునిచ్చారు. తర్వాత ప్రొఫెసర్ సరస్వతి రాజు అయ్యర్ మాట్లాడుతూ విద్య ద్వారా సామాజిక సేవ మరియు మానవ విలువలను గూర్చి విద్యార్థులకు ఎలా బోధించాలి అనే విషయాన్ని సంగ్రహంగా వివరించడం జరిగింది ప్రొఫెసర్ ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు అందరూ సామాజిక సేవలో భాగం కావాలని పిలుపునిచ్చారు. అతిథి అధ్యాపకులు డాక్టర్ పైడి రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచం ఉన్నటువంటి ఉద్రిక్త పరిస్థితులలో సోషల్ వర్కర్స్ యొక్క బాధ్యతలను గురించి వివరించారు. అలాగే మరొక అతిథి అధ్యాపకులు డాక్టర్ ఎస్. రాజశేఖర్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ సోషల్ వర్కర్స్ సంస్థ యొక్క ఆవిర్భావాన్ని, ఆవశ్యకతను గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమానికి పరిశోధకులు గుప్త, స్వరూప్, రాజేష్ , నాగేశ్వరరావు, విద్యార్థిని, విద్యార్థులు మరియు నాన్ టీచింగ్ సిబ్బంది హాజరయ్యారు.

## తోటకూర గ్రేస్ కి పీహెచ్డీ ప్రదానం చేసిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ



**పెదకాకాని మేజర్ న్యూస్ :** గుంటూరు జిల్లాలోని 'అసిస్టు' స్వచ్ఛంద సంస్థ ఆధారంగా మహిళా సాధికారతపై మైక్రో ఫైనాన్స్ ప్రభావాన్ని అధ్యయనం చేసిన రీసెర్చ్ స్కాలర్ తోటకూర గ్రేస్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గ్రామీణాభివృద్ధి విభాగంలో విభాగాధిపతి ప్రొఫెసర్ వి. దివ్యతేజోమూర్తి మార్గదర్శకత్వంలో పీ హెచ్ డి అవార్డు ను రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి .సుధాకర్ ప్రకటించారు. ఈ అధ్యయనం గ్రామీణ మహిళల ఆర్థిక స్థితి, స్వయం ఉపాధి అవకాశాలు సామాజిక స్థాయిలో వారి స్థానం ఎలా మారిందనే అంశాలపై దృష్టి సారించింది. మైక్రో ఫైనాన్స్ ద్వారా మహిళలకు చిన్న మొత్తాల రుణాలు అందించడం ద్వారా వారు చిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా స్వావలంబన సాధించే మార్గాన్ని ఈ పరిశోధన స్పష్టం చేసింది. ఈ కేస్ స్టడీ ప్రకారం, 'అసిస్టు' సంస్థ మహిళల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి, వారికి ఆర్థిక సాయం మాత్రమే కాకుండా, వ్యాపార నైపుణ్యాలు, పొదుపు అలవాట్లు, మరియు ఆర్థిక నిర్వహణపై శిక్షణను కూడా అందించింది. దీని వల్ల మహిళలు కుటుంబ ఆదాయంలో భాగస్వామ్యులై, వారి ఆత్మవిశ్వాసం పెరిగింది. సమూహంగా పనిచేయడం ద్వారా మహిళలు సామాజికంగా బలపడటంతో పాటు, నిర్ణయాల ప్రక్రియలో కూడా చురుకుగా పాల్గొనడం ప్రారంభించారు మొత్తానికి ఈ పరిశోధన మైక్రో ఫైనాన్స్ మహిళా సాధికారతకు ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తుందని నిరూపించింది. 'అసిస్టు' వంటి స్వచ్ఛంద సంస్థల పాత్ర గ్రామీణ అభివృద్ధిలో కీలకమని, మహిళల ఆర్థిక స్వతంత్రత పెరిగినప్పుడు కుటుంబ మరియు సమాజ అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని ఈ అధ్యయనం తెలియజేస్తుంది. ఇది ప్రభుత్వ మరియు ఇతర సంస్థలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తుంది.

## నివాసగృహాల మధ్యలో మద్యం దుకాణం వద్దు

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** పట్టణంలోని గార్లపాడు బస్ స్టాండ్ ప్రాంతం, గీతా మందిరం ఎదురుగా వైన్ షాప్ ( మద్యం దుకాణం) ఏర్పాటు చేయవద్దంటూ ఆర్యవైశ్య మహిళలు కదం తొక్కారు. గతంలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నించిన ఏడాది క్రితం ఆర్యవైశ్యులు ఖాళీలతో కలిసి శాసనసభ్యులు తీసుకువెళ్లగా ఆయన అక్కడ ఏర్పాటు చేయనీయలేదు. తిరిగి కొందరు వ్యాపారస్తులు.. వైన్ షాప్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండగా అధికారులకు వినతి పత్రం అందించారు. సోమవారం పల్నాడు జిల్లాకలెక్టర్ కి, సంబంధిత శాఖ జిల్లా అధికారులకు వినతిపత్రం అందించారు. మంగళవారం ఉదయం కన్నా లక్ష్మీ నారాయణ ను వారి కార్యాలయంలో ఆర్యవైశ్య మహిళలు ఆ ప్రాంత వాసులు కలసి తమ ఇబ్బందులు తెలిపారు. వైన్ షాప్ ఏర్పాటు చేయకుండా ఆపించాలి అని కోరగా సానుకూలంగా స్పందించారు. గడియారం స్తంభం వద్ద ఆర్యవైశ్య మహిళలు మానవహారం గా ఏర్పడి వైన్ షాప్ వద్దు అంటు నినాదాలు చేశారు.



## తాడికొండ వైయస్సార్సీపీలో 7941 మంది క్రియాశీలక కార్యకర్తలు

**తాడికొండ మేజర్ న్యూస్:** తాడికొండ నియోజకవర్గం లో వైఎస్ఆర్సిపి పార్టీ నందు 7941 మంది క్రియాశీలక కార్యకర్తలను గుర్తించామని వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ వనమా బాల వజ్రబాబు తెలియజేశారు. మేడికొండూరు మండలంలో 1480 మందిని, ఫిరంగిపురం మండలంలో 2053 మందిని,తాడికొండ మండలంలో 2245 మందిని,తుళ్లూరు మండలంలో 2063 మందిని,మొత్తం 7941 మంది క్రియాశీలక కార్యకర్తలుగా గుర్తించామని వీరందరూ పార్టీ చేసే ప్రతి కార్యక్రమంలో భాగస్వాములు అవుతారని ఆయన అన్నారు. ఈ క్రియాశీలక కార్యకర్తలకు వైఎస్ఆర్సిపి పార్టీ తరఫున ప్రతి ఒక్కరికి వారి భద్రత కొరకు ఇన్సూరెన్స్ కవరేజ్ ను చేసి వారి ఫోటోతో ఉన్న ఒక ఐడి కార్డును అందజేస్తామని తెలియజేశారు,. ప్రతి ఒక్క క్రియాశీలక కార్యకర్త వారికి అందజేసిన పదవులతో గ్రామాలలో,నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు.

## మాచవరంలో క్షేత్ర దినోత్సవం శాస్త్రవేత్తలు




**మాచవరం, మేజర్ న్యూస్ :** మాచవరం సచివాలయం నందు ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి వచ్చిన శాస్త్రవేత్తలు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు . కంది పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులను డాక్టర్ డి మోహన్ రెడ్డి ప్రధాన శాస్త్ర వేత్త , డాక్టర్ కె.వి శివ రెడ్డి కంది ప్రధాన శాస్త్ర వేత్త, డాక్టర్ ఎన్ సాంబశివరావు ఎంటమాలజిస్ట్, కంది లోని పురుగు లు వాటి నివారణ గురించి, విత్తన శుద్ధి, నీటి యాజమాన్యం, సస్య రక్షణ చర్యలు గురించి వివరించి రైతులకు సలహాలు సూచనలు అందించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె రామమ్మా, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రియాంక ,గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

## అగ్రిటెక్ వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన



**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** రైతన్న నీకోసం వారోత్సవాల్లో భాగంగా మండల టీడీపీ అధ్యక్షులు బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీ గళ్ళా బాబురావు లు రైతుల ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు.నీటి సౌకర్యము ఆధారంగా పంట సాగు చేస్తున్న రైతులకు అగ్రిటెక్ వ్యవసాయ పరిజ్ఞానాన్ని వాడుకుంటూ విధానాల గురించి వివరించారు.రైతన్నకు ప్రభుత్వం అందించే చేయూత సంక్షేమ పథకాల గురించి కనీస మద్దతు ధర పంట కొనుగోలు చేయుట రాయితీపై డ్రిప్ స్ప్రింక్లర్ రాయితీ సరఫరా నీటి వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కృష్ణయ్య, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కంపోస్ట్ యార్డును సందర్శించిన ఢిల్లీ బృందం

**తెనాలి, మేజర్ న్యూస్ :** బుర్రిపాలెం రోడ్డులోని ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రంను ఢిల్లీ నుండి వచ్చిన ప్రత్యేక బృందం మంగళవారం సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ రామా అప్పలనాయుడు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు తదితరులతో కలిసి కంపోస్ట్ యార్డు లోని వర్మీ కంపోస్ట్, ఆర్గానిక్ కంపోస్ట్, కోకోపిట్ కేంద్రం, ఎస్టీపీ ప్లాంట్ మొదలైనవి పరిశీలించారు. చెత్త సేకరణ, తరలింపు, ఎరువు తయారీ కేంద్రాల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. మున్సిపల్ ఇంజనీర్ పినప శ్రీకాంత్, ఏ ఈ సునీల్, పంచాయితీ రాజ్ విభాగం డిప్యూటీ ఇంజనీర్ శివరామకృష్ణ, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



## మాచవరంలో మహిళలకు వృద్ధులకు చీరలు పంపిణీ



**మాచవరం, మేజర్ న్యూస్ :** రంజాన్ వేడుకలు పురస్కరించుకొని మాచవరం ఎంపీడీవో కార్యాలయం అటెండర్ షేక్ సుభాని ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు, మహిళలకు చీరల పంపిణీ చేశారు. రంజాన్ మాసంలో పేద ప్రజలకు అన్నదానాలతో పాటు వస్త్రధానాలు చేయటం ఎంతో విశేషమని అందుకే తాను కొన్ని సంవత్సరాలుగా ప్రతి రంజాన్ పండుగకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని సుభాని అన్నారు.

## ఈనెల 19న శ్రీరామనవమి తలంబ్రాల పాట ధర్మకర్త కాశీ విశ్వనాథం



**మాచవరం మేజర్ న్యూస్ :** శ్రీరామనవమి వేడుకలు పురస్కరించుకొని ఈనెల 19వ తేదీ ఉగాది పండుగ రోజున మాచవరంలోని ఆర్యవైశ్య శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీరామనవమి తలంబ్రాల పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వంకాయల కాశీ విశ్వనాథం వంకాయల రమేష్ మంగళవారం తెలిపారు. ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న శ్రీరామనవమి సందర్భంగా పీటల మీద కూర్చొని స్వామివారికి తలంబ్రాలు పోసే ఆర్యవైశ్య దంపతులు ఈ తలంబ్రాలు పాటలో పాల్గొనవచ్చునన్నారు ఉగాది రోజున రాత్రి 8 గంటలకు సీతారామ స్వామివారి దేవస్థానంలో ఈ పాట నిర్వహిస్తున్నామన్నారు ఆర్యవైశ్యులందరూ ఈ తలంబ్రాల పాటలు పాల్గొనాలని కోరారు.

## నరసరావుపేట ఆర్డీఓగా కే. బాలకృష్ణ



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో పలువురు ఆర్డీఓలు (రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్స్) మరియు డిఆర్ఓలకు బదిలీలు, కొత్త పోస్టింగ్స్ కల్పిస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో నందిగామలో ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న కే. బాలకృష్ణను నరసరావుపేట ఆర్డీఓగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు వెలువరించింది.

## విద్యార్థినుల సౌకర్యాలపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి దృష్టి



**దుర్గి మేజర్ న్యూస్ :** దుర్గి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల హాజరు, భోజన వసతి, తరగతుల నిర్వహణ, పరిశుభ్రత వంటి అంశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే, వారికి అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, శుభ్రత, భద్రత విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు.ఈ తనిఖీలలో సంబంధిత శాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర క్యాలెండర్లను ఆవిష్కరించిన కలెక్టర్



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** వికసిత్ ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమాచార ప్రజాసంబంధాల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన "స్వర్ణాంధ్రఏ2047" క్యాలెండర్లను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు కోసం పేదరిక నిర్మూలన, ఉపాధి ఉద్యోగ కల్పన, నైపుణ్యం మానవ వనరుల అభివృద్ధి, వ్యవసాయంలో సాంకేతికత, ప్రపంచ స్థాయి రవాణా, స్వచ్ఛ ఆంధ్ర 10 సూత్రాలతో విజన్ డాక్యుమెంట్ ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని కలెక్టర్ తెలిపారు. ఈ పది సూత్రాల ప్రాధాన్యతను వివరిస్తూ "స్వర్ణాంధ్రఏ2047" అంశంతో రూపొందించిన ఈ 2026 క్యాలెండర్లను ప్రజాప్రతినిధుల కార్యాలయాలకు, జిల్లా కార్యాలయాలకు పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు లోచర్ల రమేష్ పాల్గొన్నారు.

## తాగునీటి భావి కొరకు రాస్తారోకో చేసిన గోరంట్ల ఎస్సీ కాలనీ వాసులు

- మూడు కిలోమీటర్ల మేరకు నిలిచిపోయిన వాహనాలు
- తీవ్ర ఇబ్బందులకు గురి అయిన వాహన చోదకులు




**తాడికొండ మేజర్ న్యూస్ :** త్రాగునీరు ఇంటి అవసరాలకు వినియోగించే భావి కొరకు గుంటూరు లోని గోరంట్ల ఎస్సీ కాలనీవాసులు మంగళవారం సాయంత్రం సుమారు రెండు గంటలు రాస్తారోకో నిర్వహించారు. వివరాలలోకి వెళ్తే గోరంట్ల లోని ఎస్సీ కాలనీ వాసులకు సుమారు 100 కుటుంబాల కో నీటి అవసరాల కొరకు గుంటూరు అమరావతి రహదారికి ఆనుకుని ఉన్న నీటి బావి ముఖ్యం. అటువంటి తరుణంలో ఆ నీటి బావికి వెనకాల ఒక మూడు అంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగింది. ఆ షాపింగ్ కాంప్లెక్స్ యజమానులు వారికి అడ్డుగా ఉన్నదని కారణం వలన కాంప్లెక్స్ పైకి మెట్లు నిర్మించటం కొరకు వివిధ కారణాలతో ఆ భావిని తొలగిస్తామని గ్రామస్తులకు తెలియజేయడంతో ఎస్సీ కాలనీ వాసులు తీవ్ర అభ్యంతరం తెలియజేశారు, గత మూడు రోజులుగా ఈ వివాదం నడుస్తుండటంతో సోమవారం నాడు ఆ షాపింగ్ కాంప్లెక్స్ యజమాని పలువురు ఎస్సీ కాలనీవాసులు పై పోలీసులుకు ఫిర్యాదు చేయగా, మంగళవారం నాడు సుమారు 200 నుంచి 300 మంది దాకా కాలనీవాసులు గుంటూరు అమరావతి రహదారిపై మంగళవారం



సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం వేళ అమరావతి నుంచి వస్తున్న యూనివర్సిటీ విద్యార్థులు పలువురు అధికారులు, అదేవిధంగా గుంటూరు నుంచి రాజధాని అమరావతి వెళ్తున్న వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. రెండు గంటల పైన నిర్వహించిన ఈ ట్రాఫిక్ జామ్ వలన సుమారు మూడు కిలోమీటర్ల పైన ట్రాఫిక్ జామ్ అవటంతో నల్లపాడు పోలీస్ వారు విచ్చేసి కాలనీవాసులకు నీటి భావిపై హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## రైతు సంతోషంతోనే సమాజం సుభిక్షం

అన్నదాత సుఖీభవ ఇంటింటికి ప్రచార కార్యక్రమం లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణ



**ముప్పాళ్ల, మేజర్ న్యూస్ :** రైతు సంతోషంగా ఉంటేనే సమాజం సుభిక్షంగా ఉంటుందని, రానున్న ఐదు సంవత్సరాలలో రైతును రాజు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం అన్నదాత సుఖీభవ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో మండలములోని ఇరుకుపాలెం గ్రామంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల ఇళ్లకు నేరుగా వెళ్లి కరపత్రాలు అందించి మూడో విడత సీఎం కిసాన్,అన్నదాత సుఖీభవ నిధులు ఖాతాలో జమ అయ్యాయో లేదో అడిగి తెలుసుకున్నారు. వారి సంతోషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి భద్రత డిమాండ్ ఆధారిత పంటలు అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రభుత్వం నుంచి మద్దతు లభిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నేడు రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. సాగుకి



అవసరమైన అన్ని అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.పీఎం కిసాన్ కింద ఏడాదికి రూ.6వేలు అందిస్తుంటే.. దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం రూ.14వేలు కలిపి మొత్తం ఏడాదికి రూ.20 వేలు ఇచ్చి రైతు పక్షపాతి ప్రభుత్వమని మరోసారి నిరూపించు కుంటున్నామన్నారు.రైతులకు సరిపడ ఎరువులను సబ్సిడీ ధరలపై ఎలాంటి అవాంతరాలు లేకుండా ఇస్తున్నాం. కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి ఎరువులు కొరత లేకుండా చేస్తున్నామని వివరించారు.రాయితీలపై వ్యవసాయ పరికరాలు ఇచ్చి.. సాగు రంగంలో సాంకేతిక జోడిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతు కల్లంలో ధాన్యం అమ్మగానే 24 గంటల్లో నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో డబులు జమా చేసున్నాం.ప్రచారం అనంతరం గ్రామంలో ఎంఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ. 10లక్ష లతో నూతనంగా నిర్మించిన సీసీ డ్రైన్స్ ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ముప్పాళ్ళ ఎంపీపీ కల్లం వీర భాస్కర రెడ్డి నరసరావుపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు,మండల పార్టీ అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, కోమటినేని శ్రీనివాసరావు, రావెళ్ల మధుబాబు, మండల ఏవో శ్రీధర్ రెడ్డ, కూటమి అనుబంధ సంఘాల బాధ్యులు తదితరులున్నారు.

## వీధి కుక్కల సమస్యకు శాశ్వతంగా పరిష్కారం

- నగర కమిషనర్ కె.మయూర్ అశోక్

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** గుంటూరు నగరంలో వీధి కుక్కల వలన ఎదురయ్యే సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని వీధి కుక్కల దాడులపై ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా నల్లచెరువు వంటి సున్నిత ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా 'స్నేహ ఏజెన్సీ'కి యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసి) పనుల నిమిత్తం వర్క్ ఆర్డర్ ఇచ్చామని, పొన్నూరు రోడ్డులో కొత్తగా నిర్మించిన ఏబీసీ సెంటర్‌లో అన్ని వసతులు పూర్తి చేసి మంగళవారం నుండి కార్యకలాపాలు ప్రారంభించామన్నారు. నగరవ్యాప్తంగా కుక్కలను పట్టుకోవడం, వాటికి సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్సలు (ఏబీసి) చేయడంతో పాటు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ (ఏఆర్వీ) అందించడం వంటి పనులను క్రమపద్ధతిలో నిర్వహించడానికి వార్డ్ ల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ నేతృత్వంలో ఏబీసి జరగాలని తెలిపారు. గత కొన్ని రోజులుగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మార్చి 13 నుండి 17 వరకు మొత్తం 117 కుక్కలను పట్టుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా కోర్ట్, ఎస్పీ ఆఫీస్, నల్లచెరువు ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలకు మంగళగిరి, గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన పొన్నూరు రోడ్డులోని ఏబీసి సెంటర్లలో శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా మంగళవారం ఒక్క రోజే నల్లచెరువు ప్రాంతంలో 100కు పైగా కుక్కలను పట్టుకుని పొన్నూరు రోడ్డు ఏబీసీ సెంటర్‌కు తరలించా మని, వీటన్నింటికీ బుధవారం శస్త్రచికిత్సలు పూర్తి చేస్తామని వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం శస్త్రచికిత్సలు, వ్యాక్సినేషన్




పూర్తయిన తర్వాత, ఆ కుక్కలను తిరిగి అవి పట్టుబడిన ప్రాంతాల్లోనే విడిచిపెట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఏబీసిని వేగంగా చేసేందుకు మంగళగిరి మున్సిపల్ అధికారులతో కూడా సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని, నగరవాసులకు వీధి కుక్కల నుండి సమస్య నుండి విముక్తి కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

## ఏఎన్యూలో ఆర్ యు ఎస్ ఏ 2.0 ప్రయోజిత జాతీయ సదస్సు




**పెదకాకాని మేజర్ న్యూస్ :** ఆచార్య నాగార్జునా విశ్వావిద్యాలయం మంగళవారం ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం లో ఆర్ యు ఎస్ ఏ 2.0 రెండురోజుల జాతీయ సదస్సు, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ఇన్ హెల్తకేర్ మానేజ్మెంట్ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఛాలెంజస్ అండ్ ఫ్యూచర్ డైరెక్షన్స్ అనే ప్రధాన అంశం పై ప్రారంభ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా విశ్వావిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఖ గంగాధరరావు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో గౌరవ అతిధులుగా ప్రముఖ టెక్నాలజీ, డేటా ఎనాలిటిక్స్ కంపెనీ సీఈఓ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ అన్నే, గీతం యూనివర్సిటీ వైజాగ్ కంప్యూటర్ సైన్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీష రొడ్డ, ప్రముఖ ఇంటర్వెంషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ధూళిపాళ్ళ వీర వైష్ణవి డైరెక్టర్ డివిసి హాస్పిటల్ వడ్లమూడి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం, ప్రత్యేక విధుల అధికారి ఆచార్య రవికుమార్, జిజిహెచ్ గుంటూరు ఎమర్జెన్సీ మెడిసిన్ చీఫ్ డాక్టర్ అనీల్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగఅధిపతి ఆచార్య బట్టు నాగరాజు వివిధ రాష్ట్రల నుంచి వచ్చిన విద్యార్థులు, పరిశోదకులు, ప్రొఫెసర్లు , ప్రముఖ హాస్పిటల్స్ నుంచి డాక్టర్స్, హాస్పిటల్ అధిపతులు పాల్గొన్నారు. ముఖ్య అతిధులు జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఆచార్య గంగాధర్ కీలక ఉపన్యాసంలో ఆరోగ్య రంగంలో ఆర్టిఫిషల్ ఇంటిలేజెన్స్ మెషిన్ లెర్నింగ్ ప్రధాన పాత్ర పోషించునున్నాయని, వ్యాధుల నిర్ధారణ, రోగులకు ట్రీట్మెంట్ ఓషాధాల నిర్ధారణ ప్రయోజనం, వ్యతిరేకతలు తద్వారా పేషెంట్ సేఫ్టీ హెచ్చు స్థాయిలో సాధించ వచ్చునని తెలిపారు సర్జరీ రంగంలో అద్భుతమైన కచ్చితమైన ఫలితాలు రానున్నాయని తద్వారా రోగుల ప్రాణాలు కాపాడవచ్చునని ఆర్టిఫిషల్ ఇంటిలేజెన్సీ ద్వారా చాలా వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన సమయంలో చికిచ్చ ద్వారా ప్రజల ప్రాణాలు కాపాడవచ్చు అని తెలిపారు. డివిసి హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ ధూళిపాళ్ళ వీర వైష్ణవి మాట్లాడుతూ ఆర్టిఫిషల్ ఇంటిలేజెన్స్ కచ్చితంగా వైద్యాసేవల రంగంలో మంచి మార్పులు జరుగుతాయని, పేషెంట్స్ ప్రణాలను కాపాడటంలో ఏఐ ఉపయోగం అని కానీ ప్రతి వైద్యుడు రోగులను మానవత్వంతో హ్యూమన్ టచ్ తో చికిత్స చెయ్యాలి అని అప్పుడు మాత్రమే వైద్య వృత్తికి న్యాయం చేసినవాళ్ళం అవుతామని, తెలిపారు. ఈ సదస్సులో రిజిస్ట్రార్ జి సింహాచలం ఆచార్య రవికుమార్ ఎమర్జెన్సీ మెడిసిన్ సీనియర్ డాక్టర్ అనిల్ కుమార్ యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్ అండ్ లా కాలేజ్ ఇంచార్జి ప్రిన్సిపాల్ ఆచార్య ఉద్యకుమార్ మాట్లాడుతూ శుభాకాంక్షలు తెలిపారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య నాగరాజు బట్టు మాటడుతూ, యూనివర్సిటీ అధికారులు, ఉపకులపతి, రెక్టర్, రిజిస్ట్రార్ తదితర ప్రముఖలకు వారి సహాయ సహాయ సహకారలకి ధన్యవాదములు తెలిపారు.

## రాజధాని గ్రామాలలో ఆరు నెలల్లో మౌలిక సదుపాయాలు



**తాడికొండ మేజర్ న్యూస్ :** రాజధాని గ్రామాలలో ఆరు నెలల లోపు మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. మంగళవారం నాడు రాజధాని అమరావతి గ్రామాలైన శాఖమూరు లింగాయపాలెం, మందడం, తాళ్లాయపాలెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆరు నెలల లోపే మౌలోక సదుపాయాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు వీటిలో ముఖ్యంగా అండర్ గ్రౌండ్ వాటర్, స్టాంప్ వాటర్, వీధిదీపాలు,సిమెంటు రోడ్లు,సైడ్ కాలువలు ఇంటింటికి మంచినీరు వంటి మౌలిక సదుపాయాల కల్పన 6 నెలల్లోనే పూర్తి చేస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ సి ఆర్ డి ఏ కమిషన్ కన్నబాబు పలువురు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత

**– ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్**

**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు.నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో దివ్యాంగుల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావడానికి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు.సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ బస్సుల్లో 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఉచిత ప్రయాణం వర్తించనుందని వెల్లడించారు.ఈ పథకాన్ని మార్చి 18న ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు.గత ఏడాది డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీని కేవలం రెండు నెలల్లోనే అమలు చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబాటుకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం కొన్ని బస్సుల్లో 50 శాతం రాయితీ మాత్రమే ఉన్నప్పటికీ, ఇప్పుడు చాలా సేవల్లో పూర్తిస్థాయి ఉచిత ప్రయాణం అందించడం ద్వారా దివ్యాంగులకు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు.మిగిలిన నాన్స్టాప్, సప్తగిరి, అల్ట్రా డీలక్స్, అంతర్రాష్ట్ర సర్వీసుల్లో ఇప్పటికే ఉన్న రాయితీలు కొనసాగుతాయని చెప్పారు.రాష్ట్రంలో సుమారు 11 లక్షల మంది దివ్యాంగులు ఉన్నప్పటికీ, అందులో కేవలం 2 లక్షల మంది మాత్రమే పాస్ వినియోగించుకుంటు న్నారని, తాజా నిర్ణయంతో మరింత మంది ఈ సదుపాయం పొందగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం మొదటి నుంచి దివ్యాంగుల



సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, గతంలో ప్రత్యేక రుణాలు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు కల్పించిందని గుర్తుచేశారు. దివ్యాంగుల పింఛన్లు గణనీయంగా పెంచి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచిన ఘనత కూడా టీడీపీదేనని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగుల పింఛన్ను రూ.3 వేల నుంచి రూ.6 వేల కు పెంచడం ద్వారా వారికి మరింత భరోసా కల్పించిందని తెలిపారు.మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల కోసం భారీగా బడ్జెట్ కేటాయింపులు చేయడం ప్రభుత్వం నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.గత ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను పట్టించుకోలేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం వారి సంక్షేమాన్ని ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారికి సమాన అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు.

## యువతి కిడ్నాప్

**రొంపిచర్ల మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామ సమీపంలో యువతి కిడ్నాప్ రావడం స్థానికంగా కలకలం రేపింది. ముప్పాళ్ళ గ్రామానికి చెందిన బాధితురాలు ప్రతిరోజు నరసరావుపేటలో ఒక వస్త్రా దుకాణంలో పనిచేస్తుందని పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా తుంగపాడు గ్రామ సమీపాన కిడ్నాప్ గురైనట్టు సమాచారం. యువతి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక రొంపిచర్ల పోలీసులను ఆశ్రయించారు. రొంపిచర్ల ఎస్సై వాళ్ళ సిబ్బంది హుటాహుటిన తుంగపాడు నరసరావుపేట మార్గంలోని సీసీటీవీ కెమెరాలను విశ్లేషించారు. నిందితులు ఏ దిశగా వెళ్లాలని కోణంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యల చేపట్టారు. ఈ దశలోనే కిడ్నాపర్ల చెర నుంచి బాధితురాలు తప్పించుకొని రొంపిచర్ల పోలీసులను ఆశ్రయించినట్టు సమాచారం.

## సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** మండల పరిషత్ కార్యాలయశీ లో మంగళవారం సుస్థిర మైన అభివృద్ధి లక్ష్యాలు అను అంశముల పై ప్రజా ప్రతినిధులకు, అధికారులకు అవగాహన కల్పించుటకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బండి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలకు సంబందించిన ఆదాయ వనరులపైన ఎంపీటీసీ సభ్యులకు, వార్డు మెంబర్లకు అవగాహన ఏర్పరుచుకొని చేసి, ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు తాయారు చేసుకొని అమలు చేయాలనీ తెలిపారు. స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సదన కోసం, గ్రామ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక, నిధుల వినియోగం పై పారదర్శకత మరియు సమర్థతతో కూడిన సమగ్ర సమ్మతితో ప్రణాళికలు తాయారు చేసుకోవాలని అందుకు గాను అన్ని విభాగాల నిధులను, సిబ్బందిని సమన్యాయం చేసుకొని పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిపాలన అధికారికి కె.విద్యాసాగర్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవోలు కె. శ్రీనివాసరావు, అంబయ్య, రిసోర్స్ పర్సన్స్ సత్యానంద్, రోజా ప్రకాష్, హరికృష్ణ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు.

## మంగళగిరి రూరల్ ఎస్ఐ వెంకట్ ఉగాది పురస్కారానికి ఎంపిక



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేర నియంత్రణ, ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో విశేష కృషి చేస్తున్న ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ సేవలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2026 ఉగాది పురస్కారాల్లో సేవాపతకం కింద ఆయన ఎంపిక కావడం పట్ల పోలీసు అధికారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు..2024 జూలై 10న మంగళగిరి రూరల్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీసింగ్లో చురుకుదనం ప్రదర్శిస్తూ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెంచడం, రాత్రి పహారాను బలోపేతం చేయడం, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యల ద్వారా శాంతిభద్రతలను కాపాడుతున్నారు. సున్నిత ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచి చోరీలు తదితర నేరాలను అరికట్టడంలో కీలక చర్యలు చేపట్టారు.అదేవిధంగా వివిధ కేసుల దర్యాప్తులో వేగంగా స్పందించి నిందితులను పట్టుకోవడంలో విజయవంతమయ్యారు.కాజా టోల్ గేట్ వద్ద వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ సహాయక చర్యల్లో ముందుండి సేవలు అందించారు. అలాగే టీడీపీ కేంద్ర కార్యాలయం దాడి కేసు దర్యాప్తులోనూ చురుకైన పాత్ర పోషించి పురోగతి సాధించడంలో తనదైన ముద్ర వేశారు.ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే పోలీస్ అధికారిగా గుర్తింపు పొందిన వెంకట్, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నారు. విధి నిర్వహణలోనే కాకుండా ప్రజలకు సేవ చేయడంలోనూ తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారు.విధుల్లో ప్రతిభ కనబరిచినందుకు గతంలో మంత్రి నారా లోకేష్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న వెంకట్, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉగాది పురస్కారానికి ఎంపిక కావడం మంగళగిరి పోలీసు యంత్రాంగానికి గర్వకారణంగా నిలిచింది. నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ మంగళగిరి గ్రామీణ ప్రాంతంలో నేర నియంత్రణకు కృషి చేస్తున్న ఎస్ఐ వెంకట్ సేవలు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఉగాది పురస్కారాలు



**తెనాలి, మేజర్ న్యూస్ :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేయనున్న ప్రతిష్టాత్మక కళారత్న పురస్కారాలు తెనాలిలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీలో రూపుదిద్దుకుంటున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవార్డు గ్రహీతలకు వీటిని అందించనున్నారు. తెనాలికి చెందిన ప్రముఖ అంతర్జాతీయ శిల్ప కళాకారులు కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి రవిచంద్రలు వీటిని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కె వి గోపాలకృష్ణ కాటూరి ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. ఉగాది పురస్కారాలను పరిశీలించి శిల్పులు వెంకటేశ్వరరావు, రవి చంద్రలను అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో తెనాలి కీర్తిని ఇనుమడింపచేస్తున్న వారి ప్రతిభను ఆయన కొనియాడారు.

## మద్యం వ్యాపారం చట్ట ప్రకారమే జరగాలి

**– పల్నాడు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కే.మణికంఠ**

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** మద్యం వ్యాపారాన్ని ఎక్సైజ్ చట్టం, నిబంధనల మేరకు మాత్రమే నిర్వహించాలని పల్నాడు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె .మణికంఠ వ్యాపారస్తులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం పట్టణం లోని ఎక్సైజ్ స్టేషన్ ను ఆయన సందర్శించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ పి విజయ్ కుమార్ తో కలిసి స్టేషన్ పరిధిలోని మద్యం షాపులు, బార్ల నిర్వహణదారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించారు. కేసుల నమోదు, దర్యాప్తు గురించి షాపుల తనిఖీ సమయంలో తీసుకోవలసిన చర్యల గురించి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కు తగు ఆదేశాలు ఇచ్చారు. ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వివిధ కేసులలో పట్టుబడిన మద్యాన్ని జిల్లా అధికారి పర్యవేక్షణ లో ధ్వంసం చేయించారు. సమావేశంలో స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



# విజిలెన్స్ ఆకస్మిక దాడులు


**– మూడు గృహ వినియోగగ్యాస్ సిలిండర్లు స్వాధీనం**



**యడ్లపాడు, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పెప్సీ కంపెనీ ఎదురుగా ఉన్నవ గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న విశ్వధన్ హోటల్‌పై మంగళ వారం విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న మూడు గృహవినియోగగ్యాస్ సిలిండర్లను అధికారులు గుర్తించి,వాటిని సీజ్ చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా సీజ్ చేసిన సిలిండర్లను య డ్లపాడులోని వీణా గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను హోటల్ యాజమాన్యంపై స్థానిక తహసీల్దార్ 6A కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ తనిఖీలో విజిలెన్స్ విభాగం నుండి అమర్, సైదులు, మండల డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుబ్బారావు, ఉన్నవ గ్రామ వీఆర్వో జగన్మోహన్ రావు, ఇతర మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ పనుల వేగవంతం పై చర్చలు

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి. అరుణ్ బాబు ను కలిసిన ఎమ్మెల్యే అరవింద బాబు**



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట నియోజకవర్గంలో గృహ నిర్మాణ పనుల పురోగతి పై ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి. అరుణ్ బాబు ఆయన మర్యాదపూర్వకంగా కలిసి కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే ఎమ్‌డీ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ఆయన సూచించారు. అలాగే లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నిర్మాణ సామగ్రి అందుబాటు, భూముల సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎమ్‌డీ పి. అరుణ్ బాబు, ప్రభుత్వం నిర్ణయాల ప్రకారం పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బండారుపల్లి విశేశ్వర్ రావు కూడా పాల్గొన్నారు.

# ఇస్సపాలెం మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు



**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** నరసరావుపేట మండలం ఇస్సపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం వద్ద రాష్ట్ర ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్యాత్మిక సంఘం కోఆర్డినేటర్, పల్నాడు జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో లలితా సహస్రనామ స్తోత్రాలు చదవటం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పలనాడు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి ఊరా లక్ష్మీ సుజాత, శ్రీ వాసవి మిత్ర మండలి అధ్యక్షులు చేగు వెంకటేశ్వరరావు, నరసరావుపేట టౌన్ హాల్ కమిటీ మెంబర్ కొత్త మాసు సుధాకర్, 25 మంది మహిళా భక్తులు పాల్గొన్నారు. భక్తులందరికీ పులిహోర, స్వీట్స్, మజ్జిగ ప్యాకెట్లు అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ శ్రీ మహంకాళి భజన మండలి వారిచే 11వ కార్యక్రమం నేడు అమ్మవారి సన్నిధిలో పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినదనీ తెలియజేసినారు.

# రైతుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు

**– రైతుల సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయం**

**– ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు**

**దాచేపల్లి, మేజర్ న్యూస్ :** రైతుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు.మంగళవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం లోని రామాపురం గ్రామం లో రైతన్న మీ కోసం కార్యక్రమం లో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.గత వైసిపి ప్రభుత్వం లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఏదుర్కోన్నారని నేడు కూటమి ప్రభుత్వం లో రైతులకు సకాలంలో అన్ని జరుగుతున్నాయన్నారు.రైతులకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు.ఇప్పటికే రైతుల ఖాతాల్లో మూడో విడత పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల విడుదల చేయడం జరిగిందన్నారు. అధే విధంగా పంట కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు.అంతేగాకుండా గతం లో ఎన్నడూ లేని విధంగా మిర్చికి గిట్టుబాటు ధర ఆశాజనకంగా ఉందన్నారు.కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు రైతులకు మంచి ఫలితాలు ఇస్తున్నారన్నారు.ఈ



సందర్భంగా ఆర్గానిక్ పద్ధతిలో పండించిన కూరగాయలు, బంతిపూల స్టాళ్లను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా వాటిని సాగుచేసిన రైతు మిత్ర సభ్యులను అభినందించారు.అధేవిదంగా ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు పోస్టర్ ను కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు లు అవిష్కరించారు. ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేముల వినోద్ రెడ్డి, కూటమి నాయకులు తోట వెంకటేశ్వర్లు, నర్రా పుల్లయ్య, వేముల తిరుమల కుమార్,ఐనాల శ్రీ రాములు, పగడాల భాస్కరరావు, సొసైటీ అధ్యక్షులు తంగెళ్ళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రైతన్న "మీకోసం"



**గుంటూరు రూరల్, మేజర న్యూస్ :** గుంటూరు రూరల్ మండలంలోని 11 రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం "రైతన్న మీకోసం" కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 16వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఆరు రోజులపాటు నిర్వహించబడుతుందని ఆయన వెల్లడించారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో వీఎఎలు, విహెచ్ఎల ఆధ్వర్యంలో ప్రతి రోజు గ్రామాల్లోని 30 క్లస్టర్లలో సుమారు 90 మంది రైతులకు కరపత్రాలు అందజేస్తూ, రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు ముఖ్య అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. జొన్నలగడ్డ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం, గుంటూరు నుండి ఐ. సునీత (సహాయ వ్యవసాయ సంచాలకులు) మాట్లాడుతూ, రాబోయే సీజన్‌లో ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. విత్తన గుళికలు ద్వారా సాగు, డ్రాట్ ప్రూఫింగ్ మోడల్, హాఫ్ మూన్ మోడల్ వంటి పద్ధతులను అమలు చేయాలని తెలిపారు. చిన్న పలకలూరు, పెదపలకలూరు, మల్లవరం, తురకపాలెం, జొన్నలగడ్డ గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్, వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ సహాయకులు, ప్రోగ్రెసివ్ రైతులు, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# తరగతి గదిలో టీచర్ గా మారిన ఎమ్మెల్యే

**– ఎండాకాలం జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన**

**– విద్యార్థులతో సందడి, భోజన సౌకర్యాల పరిశీలన!**

**– తిలక్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే డా॥ చదలవాడ**



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో ఉన్న తిలక్ హైస్కూల్‌ను నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యా ప్రమాణాలను, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన సౌకర్యాలను ఆయన స్వయంగా పరిశీలించారు. కాసేపు రాజకీయ నాయకుడి పాత్రను పక్కన పెట్టి, ఎమ్మెల్యే విద్యార్థులకు పాఠాలు బోధించే టీచర్‌గా మారి క్లాస్ తీసుకున్నారు. క్లిష్టమైన అంశాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరిస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం విద్యార్థులతో కలిసి కాసేపు సరదాగా గడుపుతూ ముచ్చటించారు. ముఖ్యంగా పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచిస్తూ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న ఏప్రిల్, మే నెలల వేసవి సెలవుల దృష్ట్యా విద్యార్థులకు ఎండల తీవ్రతపై అవగాహన కల్పించారు. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎండలో తిరగకుండా ఇంట్లోనే ఉండి చదువుకోవాలని, ఎక్కువగా నీరు, పండ్ల రసాలు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సెలవులను వృథా చేయకుండా సృజనాత్మక పనుల్లో నిమగ్నం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నకరికల్లు మండలంలో ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహణ

**నకరికల్లు మేజర్ న్యూస్ :** నకరికల్లు మండలంలో స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా కీలక అడుగు పడింది. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, వార్డు సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు (జీపీడీపీ), గ్రామ అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యాన్ని పెంపొం దించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది ప్రధాన థీమ్స్‌పై అవగాహన కల్పిస్తూ, గ్రామా భివృద్ధికి సమర్థవంతంగా తోడ్పడే విధంగా వారికి మార్గదర్శనం చేశారు. ఈ శిక్షణ ద్వారా గ్రామ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు మరి ంత సమగ్రంగా అమలవుతా యని అధికారులు తెలిపారు.




# బార్ అసోసియేషన్ కు త్రిముఖ పోటీ తప్పదా..?

**– ముగిసిన ఎన్నికల నామినేషన్ పత్రాల పరిశీలన ప్రక్రియ**

**– నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అభ్యర్థుల ప్రకటన**

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** బార్ అసోసియేషన్ 2026–27 సంవత్సరం నూతన కమిటీ నామినేషన్లు పరిశీలన ప్రక్రియ మంగళవారం ముగిసిందని ఎన్నికల అధికారులు జి మార్క్ రావు,యం.ఏడుకొండలు, షేక్ నాగూర్ బాబు తెలిపారు. పరిశీలనలో అన్ని నామినేషన్లు ఆమోదించబడ్డాయి. అధ్యక్ష స్థానానికి గంగూరి అజయ్ కుమార్, చిన్నం మణి బాబు, పూదోట సౌరి రాజు పోటీ చేయుచున్నారు. ఉపాధ్యక్షులుగా సందీపోగు బాబురావు, సురేష్ బాబు పోటీ చేయుచున్నారు. సబ్ కోర్ట్ కార్యదర్శిగా పి.భవాని ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. జనరల్ సెక్రెటరీ స్థానానికి గంట వెంకట శివ, షేక్ జానీ ఖాజావలీలు పోటీ పడుతున్నారు. సహాయ కార్యదర్శులుగా తిరుమల పూర్ణచంద్రరావు, కాశీమాల మార్కు పోటీపడుతున్నారు.కోశాధికారిగా బుర్రి సైదయ్య , స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పోత్తూరు హరి మణికంత, లైబ్రేరియన్ గా ఆకుల నాగార్జునలు ఒక్కొక్కరే నామినేషన్ చేశారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ గా రెండు పోస్టులకు గాను తాళ్లూరి రాజా విజయభారత్, ఎన్ రామాంజనేయులు నామినేషన్ దాఖలు చేశారు. జూనియర్ ఎగ్జిక్యూటివ్ గా ఎం సాయి శ్రవణ్, జి పవన్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం అభ్యర్థుల ఉపసంహరణ ప్రక్రియ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగనంది. గురువారం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించబడుతుందని ఎన్నికల అధికారి తెలియజేశారు. ముందుగా తెలిపిన ఎన్నిక తేదీ 27 న గౌరవ హైకోర్టు వారు శ్రీరామనవమి సందర్భంగా సెలవు దినంగా ప్రకటించారు. కనుక ఎన్నికల తేదీని ది 31/3/2026 కు మార్చడం జరిగింది. బార్ అసోసియేషన్ సభ్యులు గమనించవలసిందిగా ఎన్నికల అధికారులు సూచించారు.

# సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి






**మొదటి పేజీ తరువాయి**

నెమెరవేసుకుంటూ పలువురు సభ్యులు భావోద్వేగా నికి గురయ్యారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొంది కౌన్సిల్‌లో అడుగు పెట్టాలనే ఆకాంక్షను కొందరు కౌన్సిలర్లు వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభంకాగనే వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య లేచి అజెండాలోని అంశాలపై ఎవరైనా మాట్లాడాలని, అనంతరం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించుకుందామని సూచించారు. దీనికి అందరూ సమ్మతించడంతో పట్టణంలో గత కొన్ని దశాబ్దాల నుంచి కుక్కల సమస్య వెంటాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి శాశ్విత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే రక్షిత మంచినీటి పంపిణీలో నెలకొన్న అవరోధాలను అదిగమించేలా అధికారులు ప్రయత్నించాలని కోరారు. 30వ వార్డులో అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తి చేయాలని కౌన్సిలర్ కొమ్మరబత్తిన జయపాల్, లోటు బడ్జెట్‌ను అదిగమించేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి కోరారు. సచివాలయంలో మరుగుదొడ్లు లేక ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని త్వరగా నిర్మించాలని కౌన్సిలర్ కుర్రా సుజాత, ఎన్‌డీ కాలనీలోని మున్సిపల్ స్కూల్‌లో మరుగుదొడ్లు నిర్మించాలని, డంపింగ్‌యార్డులో చెత్తను త్వరగా తరలించాలని అడుసుమల్లి వెంకటేశ్వరరావు సూచించారు. హిందూ, ముస్లిం, క్రిష్టియన్ దేవాలయాల వద్ద ప్రతి నెల శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మొగల్ అహ్మద్ కోరారు. ఒకటో వార్డులో డ్రెయిన్స్ నిర్మించాలని, కమ్యూనిటీ హాల్‌లో వసతులు సమకూర్చాలని, అంబేద్కర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గెడ్డటి సురేంద్ర, నిర్మాణానికి నోచుకుని డ్రెయిన్స్‌ను త్వరగా ప్రారంభించాని షేక్ ఇస్మాయేల్ కోరారు. అన్నింటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కారిస్తామని కమిషనర్ జెఆర్ అప్పలనాయుడు హామీ ఇచ్చారు.

### రూ. 50 కోట్లతో పలు అభివృద్ధి పనులు..

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ చైర్మన్‌గా రెండున్నర సంవత్సరాల కాలంలో రూ.50 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వాటిలో రూ.25 కోట్ల అభివృద్ధి పనులు చేయగలిగామని, రూ.25 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. తనకు పదవినిచ్చిన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు, సహకరించిన వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు, అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

### పెండింగ్ పనులు త్వరలో పూర్తి చేస్తాం..

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఐదుళ్ళ కౌన్సిల్ పాలన ఇద్దరు చైర్‌పర్సన్‌ల నాయకత్వంలో సాగిందని గుర్తు చేశారు. పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. రూ.21 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలో పూర్తి చేస్తామన్నారు. పట్టణంలోని డ్రెయిన్ల నిర్మాణం కోసం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రూ.35 కోట్ల ప్రత్యేక గ్రాంట్‌ను తెవ్వడం జరిగిందన్నారు. వాటితో పట్టణంలోని కాల్వలన్ని నిర్మిస్తామని చెప్పారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్లు ప్రకటించి సభ్యులను అధికారులు ఘనంగా సన్మానించారు. చివరి కౌన్సిల్ సమావేశం కావడంతో సభ్యుల భావోద్వేగానికి గురయ్యారు. సమావేశంలో వైస్‌చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, ఎంఈ శ్రీకాంత్, ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, ఏసీపీ వాణి, పలువురు అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆస్తి, ఖాళీ స్థల పన్నుల బకాయిలను మార్చిలోపే చెల్లిస్తే 50 శాతం రాయితీ

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ఆస్తి, ఖాళీ స్థల పన్నుల బకాయిలు ఈ నెలాఖరులోపు ఏక మొత్తంగా చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.58 (తేదీ:16-03-2026) జారీ చేసిందని, గుంటూరు నగరంలోని పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్నుబకాయిలను ఈ నెలాఖరులోపు ఆస్తి పన్ను ఏక మొత్తంగా చెల్లిస్తే వారికి వడ్డీ 50 శాతం రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సదుపాయం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే వడ్డీతో కలిపి పూర్తిగా పన్ను చెల్లించిన వారికి, సదరు వడ్డీలో 50 శాతం రాబోవు సంవత్సరానికి పన్నులకు జమ కాబడుతుందని పేర్కొన్నారు.



ఇప్పటికే ఆస్తి పన్ను మొత్తంలో సగం చెల్లించి మిగిలిన బకాయిలున్న వారు కూడ ఈ నెలాఖరులోపు ఏక మొత్తంలో చెల్లిస్తే వారికి కూడా వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. కావున ప్రభుత్వం కల్పించిన ఈ సదావకాశాన్ని నగర పరిధిలోని పన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్మిన్ కార్యదర్శులు డోర్ టు డోర్ వెళ్లి వడ్డీ రాయితీతో కూడిన స్లిప్స్, హౌస్ సర్వీస్ కనెక్షన్ వివరాలతో నీటి చార్జీల స్లిప్స్ ని 2 రోజుల్లో నూరు శాతం అందించాలని ఆదేశించారు. బుధవారం నుండి ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు పని చేస్తాయన్నారు. ఈ నెలలో ఉగాది, రంజాన్ వంటి పండుగ, సెలవు రోజుల్లోనూ జీఎంసి మెయిన్, సర్కిల్ కార్యాలయాల్లో కౌంటర్లు పని చేస్తాయని, అవసరమైతే అదనపు కౌంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# ప్రమాదాలు తగ్గాయి... ఇదే చొరవ కొనసాగించాలి

**– జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా**



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** జిల్లాలో గత ఏడాది కంటే రహదారి ప్రమాదాలు తగ్గాయని, ఇదే చొరవ కొనసాగాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. రహదారి భద్రత కమిటీ సమావేశం మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం రహదారి ప్రమాదాలు తగ్గింపుపై అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గత 2024 సంవత్సరంలో 1046 ప్రమాదాలు జరిగాయని, 2025 సంవత్సరంలో 910 జరిగాయని తెలిపారు. రహదారి ప్రమాదాలు వలన ఎప్పుడూ జరిగే మరణాలు 2025 సంవత్సరంలో 19 శాతం తగ్గాయని చెప్పారు. రహదారి ప్రమాదాలు ఇంకా తగ్గించాలని, బ్లాక్ స్పాట్ లు వద్ద ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాలు ఉంటే అటువంటి ప్రదేశాల్లో తీసుకోవలసిన చర్యలుపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఐ రాడ్ లో అన్ని ఆసుపత్రులు నమోదు కావాలని అన్నారు. పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ మద్యం తీసుకుని వాహనాలు నడిపే వారిపై నిరంతరం డ్రైవ్ చేపడుతున్నామని అన్నారు. సర్వీసు రహదారి నుండి జాతీయ రహదారిపైకి ప్రవేశించే రహదారుల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాల్సిన అవసరం ఉందని వివరించారు. నుండి జాతీయ రహదారిపైకి ప్రవేశించే ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించే విధంగా ప్రత్యేక బృందాలతో అవగాహన చేపడుతున్నామని చెప్పారు. ఉప రవాణా కమిషనర్ సీతారామి రెడ్డి మాట్లాడుతూ బ్లాక్ స్పాట్ లు గుర్తించ మని, జాతీయ రహదారి పనులు జరుగుతున్న ప్రదేశాల వద్ద ప్రజలు వేగ నియంత్రణ పాటించాలని అన్నారు. జాతీయ రహదారి సాధికార సంస్థ అధికారులు మాట్లాడుతూ జాతీయ రహదారి పనులు త్వరలో పూర్తి చేయనున్నామని చెప్పారు. రహదారులు భవనాల శాఖ ఇంజనీర్లు మాట్లాడుతూ 14 బ్లాక్ స్పాట్ లు గుర్తించమని, వాటి వద్ద చర్యలు తీసుకొనుటకు ప్రతిపాదనలు సమర్పించమన్నారు. ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డి ఎస్పీ బి.శ్రీనివాస రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, ఎన్.టి.ఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయ అధికారి విజయ్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మినిమం వేస్ బోర్డు జోనల్ సమావేశాన్ని బాయికాట్ చేసిన కార్మిక సంఘాలు



**గుంటూరు మేజర్ న్యూస్:** ఉమ్మడి గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల జోనల్ సమావేశము జేసిఎల్ అధ్యక్షతన గీతా రీజెన్సీలో జరిగింది. ఈ సమావేశంలో మినిమం వేజ్ అడ్వైజరీ బోర్డు కమిటీ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ షెడ్యూల్ పరిశ్రమంలోని పరిశ్రమలలో వేతనాలు పెంచడానికి సూచనలు సలహాలు కోసం ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 65 రకాల షెడ్యూల్ పరిశ్రమలు ఉన్నాయని 2012 నుండి ఈ వేతన సవరణ జరగకపోవడం వల్ల కార్మికుల తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న షెడ్యూల్ పరిశ్రమంలోని కార్మికుల వేతనాలను పెంచాలని కోరారు. గత 15 సంవత్సరాలుగా వేతన సవరణ చేయకపోవడం వల్ల అన్ స్కిల్డ్ కార్మికునికి కేవలం 12000 రూపాయలు మాత్రమే జీతం పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వమే మినిమం వేజ్ ప్రామాణికాలు నెరవేరాలంటే కనీస వేతనం 30,000 ఉండాలని కోరారు. వీడియో పాయింట్ కు గతంలో పది రూపాయల 50 పైసలు ఇస్తే, 2007లో జరిగిన సవరణలో వీడియో పాయింటును ఆరు రూపాయలకు తగ్గించడం జరిగింది. ఇది కార్మికులకు తీవ్ర న్యాయం చేసినట్లు ఉంది. రాష్ట్రంలో లక్షలాది మంది కార్మికులు వేతన జరగకపోవడం వల్ల సంవత్సరానికి 15 వేల కోట్ల రూపాయలు జీతం నష్టపోతున్నారని అన్నారు. మినిమం వేజ్ అడ్వైజరీ కమిటీ అనేది ఒక ఫార్స్ గా తయారు చేశారని, టిడిపి పార్టీ అనుకూల బోర్డు గా మార్చి వేశారని అన్నారు. అడ్వైజరీ కమిటీ బోర్డులో టిడిపి కార్యకర్తలు తప్ప జాతీయ కార్మిక సంఘాలకి, స్వతంత్ర సంఘాలకి స్థానం ఇవ్వలేదు అంటే ఈ ప్రభుత్వం వేగతర వ్యాపారాన్ని ప్రోత్సహించడమే తప్ప కార్మికుల ప్రయోజనాలు ఉండవు అనేది అర్థమవుతుందని అన్నారు. మినిమం వేజ్ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం లేదని, టిడిపి బోర్డుగా మార్చారాని, నిరసిస్తూ సమావేశాన్ని బాయ్ కాట్ చేయడం జరిగింది. బాయ్ కాట్ చేసిన సంఘాల్లో ఏ ఐ టి యు సి నాయకులు వెలుగురి రాధాకృష్ణమూర్తి, మేడా హనుమంతరావు ఐ ఎన్ టి యు సి వీసా క్రాంతి కుమార్, ఐ ఎఫ్ టి యు, ఏ ఎఫ్ టు యు ఏపీ ఎఫ్ టు యు నాయకులు కృష్ణ, సిఐటియు నాయకులు కే బాబు ప్రసాద్, జి రమణ, బి ముత్యాలరావు తదితరులు ఉన్నారు.



# ఇళ్ల స్థలాల కోసం ఆందోళనను జయప్రదం చేయండి

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** అర్హులైన పేదలకు ఇంటి స్థలం, సాగుభూమి సాధనకై ఈనెల 24వ తేదీన రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్ మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఆర్థిక సహాయం చేయాలని అన్నారు. భూమిలేని నిరుపేదలకు సాగుభూమి పంపిణీ చేయాలని, ఇప్పటికే పూర్తయిన టిట్కో ఇళ్ళు లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని, భూమాఫియాను అరికట్టాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. పట్టణాల్లో గ్రామాల్లో దళితవాడల్లో స్మశాన వాటికలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మార్చి నెల 24వ తేదీన రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పట్టణంలో నియోజకవర్గ స్థాయిలో అర్హులైన పేదలందరినీ ఒకచోట సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని చెంచుకోవాలనీ లో ఆందోళనకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల శ్యాంపాల్, ఆవుల శివ నాగేశ్వరరావు, భోగ్యం రమేష్, నల్లబోతు నాగరాజు, మల్ల ఆంజనేయులు, వీరమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్.లక్ష్మినారాయణ, రీజనల్ మేనేజర్, ఫోన్ నెం. 63011 07116

# దాతృత్వ గుణాన్ని అందరూ అలవర్చుకోవాలి..!

**- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**



**మాచర్ల మేజర్ న్యూస్ :** దాతృత్వం గుణాన్ని అందరూ అలవర్చుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక 9వ వార్డు నందు పీపుల్ ఇన్ నీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీటి అవసరాల తీర్చేందుకు ఏర్పాటు చేస్తున్న నూతన బోర్లకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో దాతలు భాగస్వామ్యం కావాలని కోరారు. అంత్యోదయ వర్గాల అభ్యున్నతిలో సామాజిక సేవ సంస్థల విశేష పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. పేద ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు ముందుకు వచ్చిన సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం..!

**మాచర్ల మేజర్ న్యూస్ :** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో దివ్యాంగుల ఉచిత బస్ ప్రయాణ వసతి కల్పించేలా కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న దివ్యాంగ శక్తి పథకాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో జెండా ఊపి దివ్యాంగులకు ఉచిత బస్ ప్రయాణాన్ని ప్రారంభించి, వారితో కలిసి ప్రయాణం చేస్తారని శాసన సభ్యుల వారి కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

# లక్ష్యాల సాధనకు అంకితభావంతో పని చేయాలి


**- ఎంపీటీసీ, వార్డు మెంబర్ల శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి**




**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఎంపీటీసీ లు, వార్డు మెంబర్లు, అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఎంపీడీవో బండి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఐక్య రాజ్య సమితి సుస్థిర అభివృధి లక్ష్యాలను చేరేందుకు ముందుగా స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కీలకమని వెల్లడించారు. గ్రామాలు అభివృధి చెందితే 2030 నాటికి దేశం సుస్థిర అభివృధి లక్ష్యాల సాధన దిశగా పయనిస్తుందని చెప్పారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన,ఆరోగ్యకరమైన,బాలిక స్నేహ పూర్వక, నీరు సమృద్ధిగా కల్గిన, పచ్చదనం పరిశుభ్రత, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం సామాజిక భద్రత, సుపరిపాలన లకు సంబంధించి మెరుగైన ఫలితాలు ఎలా సాధించాలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమానికి చిలువూరి కృష్ణ ప్రసాద్, వీర్నపు శ్యామ్ చైతన్య,కె అంజి రెడ్డి లు ట్రైనర్ లు గా వ్యవహరించారు. శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ సుధా రాణి, ఎం జీ ఓ ఏ కిషోర్ బాబు, మండలం లోని అన్ని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్ లు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మైనారిటీలా ఆశ జ్యోతి కూటమి ప్రభుత్వం


**- వక్ఫ్ ఇన్స్పెక్టర్ ఖాజా మస్తాన్**



**గుంటూరు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర ఇఫ్తార్ కార్యక్రమంలో మైనారిటీల సంక్షేమానికి పెద్దపేట పాత బకాయిలకు నిధులు విడుదల చేసారని గుంటూరు, బాపట్ల జిల్లాల వక్ఫ్ ఇన్స్పెక్టర్ ఖాజా మస్తాన్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎం. ఎస్. నెం.32, తేదీ: 16.03.2026 ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సుమారు 5,000 మసీదులకు అక్టోబర్ 2025 నుండి మార్చి 2026 వరకు (6 నెలల కాలానికి) సంబంధించిన బకాయిలుగా మొత్తం రూ.45 కోట్లు విడుదల చేసి, సంబంధిత మసీదుల ఖాతాలలో జమ చేయడం జరిగింది.అదేవిధంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని (గుంటూరు, బాపట్ల జిల్లాలు) పరిధిలో ఉన్న 341 మసీదులకు, 6 నెలల కాలానికి సంబంధించిన రూ.3,06,90,000/- మొత్తాన్ని ఈ రోజు సంబంధిత మసీదుల బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరిగింది అని గుంటూరు, బాపట్ల జిల్లాల వక్ఫ్ ఇన్స్పెక్టర్ ఖాజా మస్తాన్ తెలియజేశారు.

# బిజినెస్ మోడల్ కాన్వాస్, బిజినెస్ మోడల్ ఫిట్ పై వర్క్‌షాప్






**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** నరసరావుపేట స్థానిక ఎంఏఎం మహిళా ఇంజినీ రింగ్ కళాశాలలో బిజినెస్ మోడల్ కాన్వాస్, బిజినెస్ మోడల్ ఫిట్ పై ఒకరోజు వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించబడినట్లు కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులకు స్టార్టప్ అభివృద్ధి, ఆవిష్కరణలు, వ్యాపార ప్రణాళికలపై ప్రాయోగిక అవగాహన కల్పించబడింది. ఈ వర్క్‌షాప్‌కు రిసోర్స్ పర్సన్‌గా ఎస్.ఆర్. యూనివర్సిటీ, వరంగల్‌కు చెందిన డా. గురునాదం గోలి హాజరై, వ్యాపార వ్యూహాలు, ఎంట్రప్రెన్యూర్షిప్ రంగంలో తన అనుభవాన్ని పంచుకున్నారు. ఆయన బిజినెస్ మోడల్ కాన్వాస్‌లోని ముఖ్య అంశాలు అయిన వాల్యూ ప్రపోజిషన్, కస్టమర్ సెగ్మెంట్స్, రెవెన్యూ స్ట్రీమ్స్, కాస్ట్ స్ట్రక్చర్ వంటి విషయాలను సులభంగా వివరించారు. ఇంటరాక్టివ్ సెషన్స్, కేస్ స్టడీస్ ద్వారా వర్క్‌షాప్ ఆసక్తికరంగా సాగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలను వ్యాపార రూపంలోకి మార్చుకోవడం, వాటిని సక్రమంగా అమలు చేయడం ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా. సాదినేని రామారావు ప్రారంభించి, ఇంజినీరింగ్ విద్యార్థులకు వ్యాపార దృక్పథం అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్ జె. రవిశంకర్ సమన్వయం చేయగా, విభాగాధిపతులు రాధికా, నవీన్, సితార, ఫణి బాబు తదితర అధ్యాపకులు, నిర్వహణ బృందం సహకరించారు.

# బాల్య వివాహాలు నివారణే ధ్యేయం కావాలి

**- జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ**



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** బాల్య వివాహాలు నివారణే ధ్యేయం కావాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. జిల్లా స్థాయి బాల్ వివాహ్ ముక్త్ భారత్ ప్రచార ముగింపు కార్యక్రమం ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. గత నవంబరు 27వ తేదీ నుండి మార్చి 8వ తేదీ వరకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికా అమలులో భాగంగా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణంలో వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమన్నారు. వివిధ శాఖలు నిర్వర్తించవలసిన ప్రత్యేక కార్యాచరణ పై ఆయా శాఖాధిపతులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాల్య వివాహాలు నివారణే ధ్యేయంగా పనిచేయాలన్నారు. బాల్య వివాహాలు వలన అనేక అనర్థాలకు దారి తీస్తుందని చెప్పారు. బాలికల ఆరోగ్యం పెద్ద సమస్యగా మారుతుందని, యుక్త వయసులోనే కుటుంబ భారం పడుతుందని, జీవితం అంటే ఏమిటో తెలిసే సమయానికి జీవితం చరమాంకానికి చేరుతుందని అన్నారు. సమాజంలో బాలికలకు, మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, సమాజ నిర్మాణంలో వారికి కీలక పాత్ర అందేటట్లు సహకరించాలని తెలిపారు. బాలికలు, మహిళల ఆరోగ్యం కుటుంబానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. బాల్య వివాహాలు సామాజిక రుగ్మత అన్నారు. తల్లిదండ్రులకు సరయిన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు మాట్లాడుతూ బాల్య వివాహత రహిత గ్రామాలుగా గుంటూరు జిల్లాలో అన్ని గ్రామాలను తీర్మానించే క్రమములో ఆ శాఖకు చెందిన వివిధ స్థాయిలలోని బాల్య వివాహ నిషేధిత అధికారులు తమ బాధ్యతలు సమర్ధవంతముగా నిర్వహించాలని అన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి డా. సలీం భాషా మాట్లాడుతూ బడి బయట పిల్లలు, ఎక్కువ సార్లు బడికి హాజరు కానీ పిల్లలపై దృష్టి పెట్టి, అటువంటి పిల్లలు బాల్య వివాహ బాధితులు కాకుండా విద్యా సంస్థలు అన్నిటిలో అవగాహనా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారిత అధికారి ప్రసూన మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ అన్ని శాఖల సమన్వయ కృషితో సాధ్యమని, వివిధ సమస్యలకు గురి కాబోయే బాలలను క్షేత్ర స్థాయిలో గుర్తించి వారి హక్కుల ఉల్లంఘన కాకుండా రక్షించే క్రమములో వివిధ ప్రభుత్వ శాఖలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు సమన్వయం అవసరమన్నారు. ఇతర వక్తలు మాట్లదుచు బాల్య వివాహ రహిత జిల్లాగా గుంటూరు జిల్లాను రూపుదిద్దే క్రమంలో సంబంధిత శాఖ అధికారులు శుద్ధితో పని చేస్తామని తెలిపారు. మహిళా పోలీసు స్టేషన్ డిప్యూటీ సూపరింటెండెంట్ పోలీసు వారు మాట్లాడుచు ప్రతి పొలిసు స్టేషన్లో ప్రత్యకముగా కేటాయించబడిన బాలల సంక్షేమ పొలిసు అధికారులు బాల్య వివాహాలు లేకుండా ఇతర బాల రక్షణకు సంబందించిన వివిధ చట్టాలు, విధానాలు అమలులో బాలల స్నేహ పూర్వ పద్దతితో పని చేస్తారు అని తెలిపారు. బాల్య వివాహం అనే ప్రమాదం నుండి బయట పడి ప్రభుత్వ, కుటుంబాల రక్షణలో ఉన్న చిన్నారులను ఈ సందర్భముగా సత్కరించారు. బాల్ వివాహ ముక్త్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, పోలీస్, రెవెన్యూ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, మునిసిపల్ అధికారులు, మండల, గ్రామ, వార్డు అధికారులు పాల్గొన్నారు.

# గ్యాస్ కొరత లేదు... ఆందోళన అవసరం లేదు



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** జిల్లాలో గృహ అవసర గ్యాస్ కొరత లేదని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గుంటూరు జిల్లాలో ఎల్.పి.జీ గ్యాస్ పంపిణీ విషయంలో వస్తున్న వార్తలపై వాస్తవాలను పరిశీలించుటకు మంగళవారం జాయింట్ కలెక్టర్ క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించారు. గుంటూరు బస్టాండ్ దగ్గరలో ఉన్న ఏపి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎల్.పి.జీ ఏజెన్సీను తనిఖీ చేశారు. ఏజెన్సీలో ఎన్ని కనెక్షన్లు ఉన్నవి, ఎన్ని బుకింగ్ లు చేసి ఉన్నవి, ఎన్ని సిలిండర్లు అందుబాటులో ఉన్నవి అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న వినియోగదారులతో ముఖాముఖి మాట్లాడి ఎప్పుడు బుక్ చేసారో తెలుసుకొని, బుధవారం ఉదయం నాటికి సిలిండర్ పంపిణీ చేయాలని గోడౌన్ ఇన్ ఛార్జ్ ను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో గృహ అవసరాల గ్యాస్ కు కొరత లేదని, అనవసరమైన ఆందోళనతో గ్యాస్ బుకింగ్ చేయవద్దని వినియోగదారులను కోరారు. కొందరు డెలివరీ బాయ్స్ నిర్లక్ష్యంగా ఉన్నారని పిర్యాదు చేయగా వారి పనితీరు మార్చుకోనట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించినారు. ప్రస్తుతం ఉన్న పెండింగ్ బుకింగ్ లకు సంబంధించి కొండపల్లి ప్లాంట్ నుండి లోడ్ వస్తుందని, బుధవారం నుండి ముందు బుకింగ్ చేసుకున్న వారికి ముందు పంపిణీ చేసే విధంగా సిద్ధంగా ఉన్నామని గోడౌన్ ఇన్చార్జి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ, జిల్లా మేనేజరు, పౌరసరఫరాల ఉప తహశీల్దార్లు పాల్గొన్నారు.

# డీజిఎం కిరణ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన రైల్వే బోర్డు మెంబర్ : కొంకా రాధ





**పిడుగురాళ్ల రూరల్ మేజర్ న్యూస్ :** నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆదేశాల మేరకు, ఈరోజు దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యురాలు కొంకా రాధ డీజీఎం కిరణ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసరావుపేట పార్లమెంట్ పరిధిలోని వివిధ రైల్వే స్టేషన్ల అభివృద్ధి, పునరుద్ధరణ కార్యక్రమాలపై ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. అదేవిధంగా, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, పెదకూరపాడు, వినుకొండ, సావల్యాపురం తదితర స్టేషన్లలో ముఖ్య రైళ్ల నిలుపుదల అవసరాన్ని డీజీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సౌకర్యార్థం ఈ స్టేషన్లలో మరిన్ని రైళ్లకు నిలుపుదల కల్పించాలని కోరారు. ఈ విషయాలపై దక్షిణ మధ్య రైల్వే డీజీఎం కిరణ్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పల్నాడు ప్రాంత ప్రజల ప్రయోజనార్థం రైల్వే శాఖలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను డీజీఎం ప్రశంసించారు. అలాగే, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు చొరవతో రైల్వే రంగంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రత్యేకంగా అభినందించారు.

## నకరికల్లు మండలంలో రైతన్న మీకోసం కార్యక్రమం

– జిల్లా వ్యవసాయ అధికారుల తనిఖీ



**నకరికల్లు మేజర్ న్యూస్ :** నకరికల్లు మండలంలోని దేచవరం గ్రామంలో నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కే. దేవదాసు వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల ప్రోత్సాహం, అగ్రిటెక్ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్ అభివృద్ధి మరియు ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు అందించడం అని జగ్గారావు తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడుతున్న ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రకృతి వ్యవసాయం మరియు సుస్థిర సాగు పద్ధతులు రైతులకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడతాయని చెప్పారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీస్) విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఫార్మర్ ఐడి తప్పనిసరిగా పొందాలని, రబి 2025-26 సీజన్‌లో పంట నమోదు చేసుకున్న రైతులు తమ ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే. దేవదాసు, ఏఈఓ కే. దిలీప్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు పి. పవన్ కుమార్, గ్రామ నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

## 19 న బొల్లిముంత ఫౌండేషన్ ఉగాది పురస్కార మహోత్సవం



**తెనాలి, మేజర్ న్యూస్ :** బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఉగాది పురస్కార మహోత్సవాలు స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చందు సుబ్బారావు తెలిపారు. అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు అధ్యక్షతన జరిగే పురస్కార ప్రధాన సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ డబుల్ హార్స్ గ్రూపు అధినేత మునగాల శ్యాంప్రసాద్, మైత్రి హాస్పిటల్ ఎండీ డాక్టర్ కృష్ణ సందీప్, విజికే ఫౌండేషన్ కార్యదర్శి తుమ్మల కిషోర్ బాబు పాల్గొంటారని తెలిపారు. తెనాలి డీఎస్పీ బి జనార్దనరావు, సాహితీవేత్త అంబంటి మురళీకృష్ణ, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కొమ్మినేని జగదీశ్వరి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ తోట రాఘవరావు, ఉత్తమ పారిశ్రామిక వేత్త పొత్తూరి లలిత కుమారి, అక్షర ఫౌండేషన్ కార్యదర్శి జాస్తి వినోదలక్ష్మి, ప్రజా కళాకారులు రంగం రాజేష్, ప్రకృతి సేద్యం రైతులు యర్రు బాపారావు, స్వాతి, ఉపాధ్యాయులు గేరా జయప్రకాష్, కవి రంగిశెట్టి రమేష్, గాయని చల్లగాలి శ్రీదేవి, రంగస్థల నటి జ్యోతిలకు ఉగాది పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. తొలుత స్థానిక సిపిఐ కార్యాలయంలో పురస్కారాలకు సంబంధించి బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొల్లిముంత శివరామకృష్ణ, బెన్ హర్, మొవ్వ సత్యనారాయణ, చింతల శ్రీనివాసరావు, కొండమూది రమేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రియవిద్యాలయానికి ఇంటర్మీడియట్ మంజూరు

- ఎంపీ లావు, ఎమ్మెల్యే కన్నా కృషి
- పల్నాడులోని మరింత మంది విద్యార్థులకు లబ్ది
- ఎమ్మెల్యే కన్నాకు కృతజ్ఞతలు తెలిపిన కె.వి విద్యార్థులు తల్లిదండ్రుల కమిటీ



**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని రామకృష్ణాపురంలోని పి యం శ్రీ కేంద్రీయ విద్యాలయానికి ఇంటర్మీడియట్ తరగతలు మంజూరు అయ్యాయి. ఇప్పటివరకు పదవ తరగతి వరకే కొనసాగుతున్న కెవిలో అదనపు తరగతుల మంజూరుతో పల్నాడులో అనేకమంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. సత్తెనపల్లి, చిలకలూరిపేటలోని, ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయానికి అదనపు సెక్షన్లు కూడా మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన ఉత్తర్వులు సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి విడుదలయ్యాయి. సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయానికి ఇంటర్మీడియట్ మంజూరు కోసం నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ లు ఎంతగానో కృషి చేశారు. కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత శాఖ వద్ద ఈ ఇంటర్మీడియట్ ఏర్పాటుపై ఎంపీ కృష్ణ దేవరాయలు చూపిన చొరవతో త్వరగా ఫలితం వచ్చింది. అలాగే పల్నాడులోని అత్యధిక మంది విద్యార్థులకు విద్య అందేందుకు చొరవ చూపగా అదనపు సెక్షన్లు మంజూరయ్యాయి. కె విలో 4, 5 తరగతులకు ఒక్కో అదనపు సెక్షన్ (సెక్షన్ కు 40 మందికి అవకాశం వస్తుంది), అలాగే ఇర్లపాడు కేంద్రియ విద్యాలయంలో 3, 4, 5 తరగతులకు ఒక్కో అదనపు సెక్షన్ మంజూరయ్యింది. విద్యా అవకాశాలు మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపడటంలో మా వంతు కృషి చేస్తామని ఎంపీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేసారు.




### కన్నాకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రుల కమిటీ

కె వి లో ఇంటర్మీడియట్ తరగతులు మంజూరు కావటం, ఈ ఏడాది తరగతులు ప్రారంభించేందుకు అవకాశం రావడం సంతోషించదగిన పరిణామం అని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. అదనపు తరగతుల మంజూరుకు కృషి చేసిన నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు, తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి,స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు కె వి తల్లిదండ్రుల కమిటీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఇంటర్మీడియట్ 11వ తరగతి గా (సైన్స్) ప్రారంభం కాబోతోంది . దీంతో విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే మెరుగైన విద్యా అవకాశాలను పొందే అవకాశం కలుగుతోంది. ఈ సందర్భంగా శాసనసభ్యులు కన్నాను కలిసి కృతజ్ఞతలు తెలిపి, సత్కరించిన వారిలో... నరసరావుపేట పార్లమెంటు తెదేపా ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు, ముప్పాళ్ళ మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు, కంతేటి అనిల్ చౌదరి, షేక్ భాషా, చింతకుంట్ల వెంకట రాంబాబు, పాటిబండ్ల రవి కుమార్, నూరుభాషా జానీబాబు తదితరులు ఉన్నారు.